WANTED

**జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.**

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా
మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో
పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/
జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది.
అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు..
ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

**సంప్రదించాల్సిన నెంబర్లు:**
**9492580091**



Facebook.varadhinews

# విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి:1
సంచిక:31
శుక్రవారం,
04.10.2024




# కొండా సురేఖపై సినీ తారల ఆగ్రహం

- చౌకబారు, నిరాధార ఆరోపణలు చేయొద్దు
- మీలాంటి వారిని చూస్తే అసహ్యమేస్తోంది
- సినీ నటులను టార్గెట్ చేయడం సిగ్గుచేటు
- హద్దులు దాటి ప్రవర్తించడం మంచిది కాదు
- ఎక్స్ వేదికగా సినీ నటుల ట్వీట్లు
- మంత్రిపై నాగార్జున పరువునష్టం దావా

**వారధి, స్టేట్ బ్యూరో:**
నాగచైతన్య, సమంతల విడాకులు, సినీ ఇండస్ట్రీపైనా మంత్రి కొండా సురేఖ చేసిన సంచలన వ్యాఖ్యలపై టాలీవుడ్ భగ్గుమంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా సినీ సెలబ్రిటీలు మొత్తం కలిసికట్టుగా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు తగవని హెచ్చరిస్తున్నారు. మీ రాజకీయ లబ్ధి కోసం సినీ ఇండస్ట్రీకి చెందిన సెలబ్రిటీల జీవితాలను వాడుకుంటారా అంటూ మండిపడుతున్నారు. సినీ ఇండస్ట్రీ అంటే అంత చులకన అయ్యిందా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ స్పందించని అగ్రహీరోల దగ్గర నుంచి చిన్న హీరోలు, దర్శకులు సైతం స్పందిస్తున్నారు.

2 లో

# సిమెంట్ ధరలు పెంపు

- ఉత్పత్తి సంస్థల కీలక నిర్ణయం
- 50 కేజీల బస్తాపై రూ.20–30 పెరుగుదల
- నిర్మాణ రంగంపై ప్రభావం చూపే అవకాశం




2 లో



# కేటీఆర్, హరీశ్, సబిత ఫామ్‌హౌజ్‌లు కూల్చొద్దా..?

- మూసీని అడ్డం పెట్టుకుని ఎన్నాళ్లు బతుకుతారు
- ఫామ్‌హౌజ్‌ల కోసమే పేదలను రెచ్చగొడుతున్నారు
- హైడ్రాపై అసెంబ్లీలో చర్చ జరిగింది కదా
- అప్పుడు ఎందుకు సూచనలు ఇవ్వలేదు
- త్వరలో హైడ్రాపై అఖిలపక్షం ఏర్పాటు చేస్తాం
- నిధుల కోసం మోడీ వద్దకు వెళ్దామా ఈటల
- త్వరలో పేదలందరికీ కుటుంబ డిజిటల్ కార్డులు
- సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు




**వారధి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే కుటుంబ డిజిటల్ కార్డు ఇవ్వాలని ఆలోచించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్‌లో కుటుంబ డిజిటల్ కార్డుల కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఒకే రాష్ట్రంఒకే కార్డు పేరిట పైలట్ ప్రాజెక్టు కార్యక్రమంలో మంత్రి పొంగులేటి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, కలెక్టర్ అనుదీప్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 'రేషన్ కార్డు కోసం పదేళ్లు ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగారు. కేసీఆర్ అధికారంలో ఉంటే రేషన్‌కార్డు రాదని మాకు అధికారం ఇచ్చారు. కొత్తగా రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. సంక్షేమ పథకాల అమలుకు డిజిటల్ కార్డులు అవసరం. ప్రతి పేదవాడికి కార్డు ఇవ్వాలన్న లక్ష్యంతో ఉన్నాం. ఫ్యామిలీ డిజిటల్ కార్డు కుటుంబానికి రక్షణ కవచం. డిజిటల్ కార్డులో కుటుంబానికి సంబంధించిన వివరాలు ఉంటాయి.' అని తెలిపారు.

**ఫ్యామిలీ కార్డు ఉంటే రేషన్ ఎక్కడైనా తీసుకోవచ్చు..**

ఫ్యామిలీ కార్డు ఉంటే చాలు రేషన్ ఎక్కడైనా తీసుకోవచ్చని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో 30 శాఖలకు సంబంధించిన సమాచారం ఉంటుందని వెల్లడించారు. మహిళలే కుటుంబ పెద్దగా డిజిటల్ కార్డు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పులు, తప్పులు చేసిందని విమర్శించారు. ఎలివేటెడ్ కారిడార్‌కు అనుమతులు తెచ్చిందే తాను అని గర్వంగా చెప్పారు. అధికారం కోల్పోవడంతో విచక్షణ కోల్పోయి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారన్నారు. అలాగే హైదరాబాద్ ట్రాఫిక్, వరదల సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ఖాతాల్లో రూ.1,500 కోట్లు ఉన్నాయని,

2 లో

### కిరాయి మనుషులతో బీఆర్ఎస్ హడావుడి..

కిషన్‌రెడ్డి, ఈటల మీకు ప్రధాని మోదీ చేపట్టిన సబర్మతి రివర్ ఫ్రంట్ కావాలి కానీ మూసీ రివర్ ఫ్రంట్ వద్దా అంటూ సీఎం రేవంత్ ప్రశ్నించారు. కిరాయి మనుషులతో కేటీఆర్, హరీశ్‌రావు హడావుడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షా నికి మునిగిపోతున్న నగరాన్ని కాపాడుకుందామని సూచించారు. కేటీఆర్, హరీశ్‌రావు సచివాలయానికి రండి నాలుగు రోజులు చర్చిద్దామన్నారు. ఈ ప్రభుత్వం పేదల కన్నీళ్లు చూడదలచుకోలేదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. మూసీ నిర్వాసితులకు ఎలా ఆదుకోవాలో సూచనలు ఇవ్వండని అడిగారు. ఈటల రాజేందర్ మీ నేతృత్వంలోనే నిధుల కోసం మోదీ వద్దకు వెళ్దామన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ను తీసుకుని రండి రూ.25 వేల కోట్లు ఇప్పించండని సీఎం కోరారు. హైదరాబాద్ నగరంలో చెరువులు ఆక్రమించిందెవరో తేల్చుదామని సవాల్ విసిరారు. మూసీ వల్ల నల్గొండ ప్రజలు విషాన్ని మింగుతున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.



# కేసీఆర్‌ను గొంతు పిసికి చంపేశాడేమో..?

- కేటీఆర్‌పై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు
- కేసీఆర్ కనపడకపోతే అనుమానపడాల్సి వస్తోంది
- మరోసారి మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:**
నిన్నటి వ్యాఖ్యల వేడి చల్లారకముందే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్నాళ్లుగా కేసీఆర్ కనపడటం లేదని.. కేటీఆర్ ఆయన గొంతు పిసికి చంపిండేమోనని అనుమానం వ్యక్తం చేశారు. గురువారం ఆమె మీడియాతో

2 లో

# తెలంగాణలో ఆర్ఆర్, ఆర్జీ ట్యాక్స్‌లు

- పేదల ఇండ్లు కూలిస్తే సర్కారు కూలడం ఖాయం
- పేదలపై ప్రతాపం మాని బడాబాబులపై చూపించు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ దోపిడీ, దొంగల పార్టీలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



2 లో




# పంచాయతీ ఓటర్లు 1,67,33,584

- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- అత్యధికంగా నల్గొండ జిల్లాలో 10.42 లక్షల ఓటర్లు
- తుది జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం

2 లో



# ఈ సీజన్ నుంచే.. సన్న వడ్లకు రూ.500 బోనస్

3 లో

- తాలు, తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- అన్నదాతలను మోసం చేసే వారిపై క్రిమినల్ కేసులు
- రాష్ట్రవ్యాప్తంగా 7వేల ఐకేపీ కేంద్రాలు
- గోనెసంచులు అందుబాటులో పెట్టాలి
- ధాన్యం కొనుగోళ్లపై కాల్ సెంటర్
- కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

# కేటీఆర్, హరీష్ రావుపై కేసు నమోదు

- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు
- ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు

2 లో

# సెక్యూరిటీ లేకుండా మూసీ వద్దకు వెళదామా..?

- కూల్చివేతలపై ప్రజలు మద్దతిస్తే ముక్కు నేలకు రాస్తా
- రేవంత్‌ను ఎవరైనా మెచ్చుకుంటే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- పేదల నీడను చెడగొట్టే వాళ్లకు శిక్ష తప్పదు
- సీఎం రేవంత్‌కు ఎంపీ ఈటల సవాల్



**వారధి, స్టేట్ బ్యూరో:**
సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సవాల్ విసిరారు. కూల్చివేతలు కరెక్టే, శభాష్ రేవంత్ రెడ్డి అని ప్రజలు ఎవరైనా మెచ్చుకుంటే.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఈటల అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే.. సెక్యూరిటీ లేకుండా మూసీ కూల్చివేతల ప్రాంతాల్లోకి రావాలన్నారు. కూల్చివేతలపై మూసీ ప్రజలు రేవంత్‌కు మద్దతిచ్చిన్నా, మెచ్చుకున్నా ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్తానన్నారు ఈటల రాజేందర్. అంతేకాదు రాజకీయ సన్యాసం కూడా తీసుకుంటానని చెప్పారాయన. "సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా మూసీ పరివాహక ప్రాంతాలకు రావాలి. కూల్చివేతలపై ఒక రోజు లేదా 2 రోజులు చర్చ పెట్టండి. కూల్చివేతలు కరెక్టే అని ప్రజలు అంటే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా. బహిరంగంగా క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తా. కేసీఆర్ నిజ స్వరూపం ఆరేళ్లకు తెలిస్తే, రేవంత్ నిజ స్వరూపం ఆరు నెలల వ్యవధిలోనే బయటపడింది. సీఎం రేవంత్ అధికారం తలకెక్కి

2 లో

# రేవంత్ పాలనలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

- పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం..
- పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం
- రాష్ట్రానికి పెట్టుబడులు ఆగిపోయాయి
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గాయ్
- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**వారధి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకం అమలుకు నోచుకోలేదు. రేవంత్ సర్కార్ పరిపాలన ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. పరిపాలన అస్తవ్యస్తంగా మారడంతో పెట్టుబడులు

3 లో



# సిమెంట్ ధరలు పెంపు

- **ఉత్పత్తి సంస్థల కీలక నిర్ణయం**
- **50 కేజీల బస్తాపై రూ.20–30 పెరుగుదల**
- **నిర్మాణ రంగంపై ప్రభావం చూపే అవకాశం**

**వారధి, స్టేట్ బ్యూరో:**
తెలుగు రాష్ట్రాల్లో సిమెంట్ ధరలు పెరిగాయి. సిమెంట్ ధరల్ని పెంచుతున్నట్లు ఉత్పత్తి సంస్థలు నిర్ణయం తీసుకున్నాయని 'ఎన్డీటీవీ ప్రాఫిట్' పేర్కొంది. ఇండియా సిమెంట్స్, దాల్మియా భారత్, రామ్‌కో, అల్ట్రాటెక్, ఏసీసీ సహా ప్రధాన సిమెంట్ కంపెనీలు ధరలు సవరించాయి. ఏపీ, తెలంగాణలో 50 కేజీల సిమెంట్ బస్తాపై రూ.2030 మేర ధర పెంచిందని జాతీయ మీడియా పేర్కొంది. తమిళనాడులో రూ.1020 పెంచినట్లు తెలిపింది. సవరించిన ధరలు ఈరోజు నుంచే అమల్లోకి వచ్చాయి. ముడిసరుకులు, పెరుగుతున్న రవాణా ఖర్చుల్ని తగ్గించుకోవడంలో భాగంగా సిమెంట్ ఉత్పత్తి సంస్థలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ రంగంతో పాటు మౌలిక సదుపాయాల కార్యకలాపాల పై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. భారీ మొత్తంలో సిమెంటును వినియోగించే నిర్మాణ సంస్థలపై ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. పెరిగిపోతున్న ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు సొంతింటిని నిర్మాణ ఖర్చు మరింత పెరగనుంది.

# కొండా సురేఖపై సినీ తారల ఆగ్రహం



**తరువాయిభాగం**
సినిమా వాళ్లను టార్గెట్ చేయడం సిగ్గుచేటు: చిరంజీవి
టాలీవుడ్ అగ్రహీరో మెగాస్టార్ చిరంజీవి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్తల్లో నిలవడం కోసం సినీనటుల సాఫ్ట్ టార్గెట్‌గా చేసుకోవడం సిగ్గు చేటు అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'గౌరవనీయులైన మహిళా మంత్రి చేసిన అవమానకర వ్యాఖ్యలు చూసి నేను చాలా బాధపడ్డా. త్వరితగతిన వార్తల్లో నిలిచేందుకు సెలబ్రిటీలు.. సినీ కుటుంబానికి చెందిన వ్యక్తులను సాఫ్ట్ టార్గెట్ చేసుకోవడం సిగ్గు చేటు. చిత్ర పరిశ్రమకు చెందిన సభ్యులపై ఇలాంటి మాటల దాడులను మేమంతా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నాం. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తులు, మరీ ముఖ్యంగా మహిళలపై ఇలాంటి ఆరోపణలు చేసి దిగజారవద్దు. సమాజాభివృద్ధి కోసం మేము మా నాయకులను ఎన్నుకుంటాం. ఇలాంటి వ్యాఖ్యలు చేసి వారు తమ స్థాయిని తగ్గించుకోకూడదు. రాజకీయ నాయకులు, గౌరవప్రదమైన స్థానాల్లో ఉన్నవారు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలవాలి' అంటూ మెగాస్టార్ చిరంజీవి సున్నితంగా హెచ్చరించారు.

**విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోం : ఎన్టీఆర్**
కొండా సురేఖ వ్యాఖ్యలను ఎన్టీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. "కొండా సురేఖ వ్యక్తిగత విషయాలను రాజకీయాల్లోకి లాగడం దిగజారుడు తనానికి నిదర్శనం. ప్రజా జీవితంలో ఉన్న ఆమె గౌరవంగా ప్రవర్తించాలి. సినీ పరిశ్రమలోని ప్రముఖులపై నిరాధార వ్యాఖ్యలు చేయడం నిజంగా బాధాకరం. ఎవరికి వాళ్లు ఇండస్ట్రీ వ్యక్తులపై దారుణమైన వ్యాఖ్యలు చేస్తామంటే చూస్తూ ఊరుకోం. హద్దులు దాటి ప్రవర్తించడం ఎవరికీ మంచిది కాదు. నిర్లక్ష్య పూరిత ప్రవర్తన రాజకీయ జీవిత సమాధికి కారణం అవుతుంది" అని ఎన్టీఆర్ హెచ్చరించారు.

**నా పేరును వాడొద్దు ప్లీజ్: రకుల్ ప్రీత్ సింగ్**
మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై రకుల్ ప్రీత్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఈ మేరకు.. తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పోస్టులు పెట్టారు. "క్రియేటివిటీ, ప్రొఫెషనలిజంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. నేను ఈ అందమైన పరిశ్రమలో చాలా గొప్ప ప్రయాణం చేశాను. ఇప్పటికి కూడా తెలుగు చిత్ర పరిశ్రమతో కనెక్ట్ అయ్యే ఉన్నాను. ఇలాంటి గొప్ప చిత్రసీమలో పని చేసే మహిళలపై.. నిరాధారమైన, దుర్మార్గపు పుకార్లు వ్యాప్తిచేయటం బాధాకరం. మరింత బాధకలిగించే విషయం ఏమిటంటే.. చాలా బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న మహిళే ఇలాంటి ఆరోపణలు చేస్తుండటం దారుణం. గౌరవంగా బతకటం కోసం.. కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సి వస్తుంది. కానీ అది మన బలహీనత అని తప్పుగా భావిస్తుంటారు. నాకూ రాజకీయానికి ఏమాత్రం సంబంధం లేదు. ఏ రాజకీయ నేతతో గానీ.. పొలిటికల్ పార్టీతో గానీ ఎలాంటి సంబంధం లేదు. తమ రాజకీయ మైలేజీని పెంచుకోవడానికి.. నా పేరును ఇలా అభ్యంతరకరంగా వాడుకోవద్దని కోరుతున్నాను. కళాకారులు, క్రియేటివ్ వ్యక్తులను రాజకీయాలు అనే రొంపి నుంచి దూరంగా ఉంచాలి. వారి పేర్లను కల్పిత కథలతో ముడిపెట్టి.. వార్తల్లో నిలిచేందుకు వాడుకోవద్దు." అంటూ రకుల్ ప్రీత్ సింగ్ ఘాటుగా స్పందించారు.

**పరువు నష్టం దావా వేసిన నాగార్జున**
మంత్రి కొండా సురేఖపై హీరో అక్కినేని నాగార్జున పరువునష్టం దావా వేశారు. తమ కుంటుంబ సభ్యుల గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో తెలుగు చిత్ర పరిశ్రమను రాజకీయాల్లోకి లాక్కొచ్చారు. ముఖ్యంగా సమంత, నాగచైతన్య, నాగార్జున పేర్లను ప్రస్తావించడం, వారి వ్యక్తిగత విషయాలను మీడియా ముఖంగా మాట్లాడడంతో అవి కాస్త వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో కొండా సురేఖ వ్యాఖ్యలను ఇప్పటికే అటు అక్కినేని కుటుంబం, ఇటు సమంత ఖండించారు.



# కేసీఆర్‌ను గొంతు పిసికి చంపేశాడేమో..?

**తరువాయిభాగం**
మాట్లాడుతూ.. 'కొన్ని రోజుల నుంచి కేసీఆర్ కనిపిస్తలేడు. అసలే కేటీఆర్‌కు పదవీ కాంక్ష ఎక్కువ. లోపల ఏమన్నా బొండిగె పిసికి సావగొట్టిండో.. తలకాయ పగలగొట్టిండో తెల్వది. మనిషి కనపడకపోతే అనుమానపడాల్సిన పరిస్థితి వస్తది కాబట్టి.. మనమందరం కూడా పాపం కేసీఆర్ గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఆయన బాగుండాలని కోరుకుందాం' అంటూ కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**కేటీఆర్ వల్లే బీఆర్ఎస్ ఓటమి..**
పదేళ్లుగా ఉన్న అధికారం కోల్పోవడంతో.. ఏం మాట్లాడుతున్నారో బీఆర్ఎస్ నేతలకు అర్థం కావడంలేదని కొండా సురేఖ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీపై విష ప్రచారం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఓటమికి కేటీఆరే కారణం అని విమర్శించారు. కేటీఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని.. మంచి ఆలోచనతో ప్రతిపక్ష నేతగా సలహాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పనులకు అడ్డుపడితే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. పదేళ్లు కేసీఆర్‌ను పక్కనపెట్టి సీఎంలా కేటీఆర్ వ్యవహరించారని.. ఎన్నో కుంభకోణాలు చేశారన్నారు. పనికిమాలిన పనులు చేసి బీఆర్ఎస్‌కు చెడ్డపేరు తెచ్చారని మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించారు.



# కేటీఆర్, హరీశ్, సబిత ఫామ్‌హౌజ్‌లు కూల్చొద్దా..?

**తరువాయిభాగం**
వాటిలో రూ.500 కోట్లు మూసీ పరిధిలోని పేదలకు పంపిణీ చేయాలని వ్యాఖ్యానించారు.

**హైడ్రాపై అఖిలపక్షం ఏర్పాటు చేస్తాం..**
హైడ్రాపై అసెంబ్లీలో చర్చించామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆనాడు హైడ్రాపై సూచనలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మూసీ పరీవాహక ప్రాంత పేదలకు 15 వేల ఇళ్ల కేటాయింపునకు ఆదేశాలు ఇచ్చామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కంటే ప్రత్యామ్నాయం ఏముందని ప్రసంగించారు. అఖిలపక్షం సమావేశం ఏర్పాటు చేస్తాం, వచ్చి సలహాలు ఇవ్వండని ప్రతిపక్షాలకు సూచించారు. కేటీఆర్, హరీశ్ రావు, సబిత కుమారుల ఫామ్‌హౌస్‌లు కూల్చాలా? వద్దా? చెప్పండని అడిగారు. ఫామ్‌హౌస్‌లు కూల్చుతారనే పేదలను అడ్డుపెట్టుకుని ధర్నాలు, దీక్షలు చేస్తున్నారని మండిపడ్డారు. మూసీని అడ్డం పెట్టుకుని ఎంతకాలం బతుకుతారు, హైదరాబాద్‌లో మీ భరతం పడతామని హెచ్చరించారు.



# కేటీఆర్, హరీష్ రావుపై కేసు నమోదు

- **బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు**
- **ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు**

**వారధి, స్టేట్ బ్యూరో:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై కేసు నమోదైంది. గురువారం హైదరాబాద్‌లోని సైబర్ క్రైమ్ ఆఫీసులో బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు మేరకు కేటీఆర్, హరీష్ రావుతో పాటు పలు యూట్యూబ్ ఛానల్స్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు స్పష్టం చేశారు. కాగా, ఇటీవల సిద్దిపేట జిల్లాలో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీ రఘునందన్ రావు ఆమె స్వాగతం పలుకుతూ నూలుపోగు దండ వేశారు.
అయితే, దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా ట్రోల్స్ చేశారని సాక్ష్యాలతో కొండా సురేఖ ఆరోపణలు చేశారు. ఇదే అంశంపై రఘునందన్ రావు కూడా స్పందించి బీఆర్ఎస్ శ్రేణులపై మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన ఎంతటివారినైనా వదిలిపెట్టేది లేదని రఘునందన్‌రావు స్పష్టం చేశారు. ఒక ఆడబిడ్డను అవమానించేలా పోస్టులు పెట్టడం తగదని హెచ్చరించారు. ఇప్పటికే ఈ ఇష్యూపై దుబ్బాక, సిద్దిపేట, సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తాజాగా సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



# సెక్యూరిటీ లేకుండా మూసీ వద్దకు వెళదామా..?

**తరువాయిభాగం**
మాట్లాడుతున్నారు. గతంలో ఉన్న ముఖ్యమంత్రి కూడా ఇలానే మాట్లాడారు. ప్రజలు బ్రహ్మాండంగా ఉన్నారని చెప్పారు. కొంతమంది సన్నాసులు ఏదేదో మాట్లాడుతున్నారని కామెంట్ చేశారు. సన్నాసులు మాట్లాడుతున్నారో, ప్రజలు మాట్లాడుతున్నారో తర్వాత కేసీఆర్ కు అర్థమైంది. రేవంత్ రెడ్డికి కూడా ఇప్పుడు అర్థం కాదు. ప్రజలు విపరీతంగా తిడుతున్నారు, విపరీతంగా ఏడుస్తున్నారు. రేవంత్ రెడ్డి ఒక్కటి గుర్తుపెట్టుకో. నీడను చెడగొట్టే వాళ్లకు శిక్ష తప్పదు. హరీశ్ రావు రాసిస్తే నేను చదువుతానా. అంత దిక్కుమాలిన పరిస్థితి ఉందా? రేవంత్ రెడ్డికి అవగాహన ఉందా? జ్ఞానం ఉందా? అసెంబ్లీలో నావి వందల స్పీచ్ లు ఉన్నాయి.
ఎవరూ మాట్లాడని నాడు హైడ్రా గురించి మాట్లాడింది నేనే. ప్రతి కాలనీ, ప్రతి బస్తీలో తిరిగా. నాకు అర్థమైంది.. రేవంత్ రెడ్డి మూర్ఖపు పని చేస్తున్నారు. తనని తాను రాజు, ముఖ్యమంత్రి, చక్రవర్తి అనుకుంటున్నారు. హైడ్రా అనే బ్రెయిన్ చైల్డ్ తెచ్చిందే రేవంత్ రెడ్డి. కోర్టు వేసిన మొట్టికాయలు, కామెంట్స్ రేవంత్ రెడ్డికే వర్తిస్తాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు వర్తించవు. మౌలాలీ దగ్గర బండ చెరువుకు వెళ్లా. 7వేల 500 ఇళ్లు ఉన్నాయి. అన్నీ లేఔట్లు, కాలనీలు.. 1980 నుంచి ఉంటున్నారు. దాదాపు 60వేల జనాభా ఉంటుంది. ఇవాళ ఎంత బాధపడుతున్నారో. 40 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లను కూలగొడతాం అంటున్నారు. మాకు ఏం గ్రహచారం పట్టింది బిడ్డా.. ఇందుకేనా వారికి ఓట్లు వేసింది" అని వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారని ఈటల రాజేందర్ అన్నారు.





# పంచాయతీ ఓటర్లు 1,67,33,584

- **పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం**
- **అత్యధికంగా నల్గొండ జిల్లాలో 10.42 లక్షల ఓటర్లు**
- **అత్యల్పంగా మల్కాజ్‌గిరి జిల్లాలో 64,397 ఓటర్లు**
- **తుది జాబితా ప్రకటించిన ఎన్నికల సంఘం**

**వారధి, స్టేట్‌బ్యూరో:**
గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం షెడ్యూలు ఖరారు చేయకపోయినా స్టేట్ ఎలక్షన్ కమిషన్ మాత్రం సన్నాహాల్లో నిమగ్నమైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రూపొందించిన జాబితాకు అనుగుణంగా ముసాయిదా జాబితాను రూపొందించిన ఎన్నికల సంఘం ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలనలోకి తీసుకుని తుది జాబితాను ప్రకటించింది. రాష్ట్రం మొత్తం మీద 1.67 కోట్ల (1,67,33,584) మంది ఓటర్లు (గ్రామీణ) ఉన్నట్లు పేర్కొన్నది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 10.42 (10,42,545) లక్షల మంది ఓటర్లు ఉంటే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కేవలం 64,397 మందే ఉన్నారు. పట్టణ ప్రాంతం కావడంతో గ్రామీణ ఓటర్ల సంఖ్య తక్కువగా ఉన్నది. రాష్ట్రం మొత్తం మీద 538 మండలాల పరిధిలోని 12,867 గ్రామ పంచాయతీల్లో 1,13,722 వార్డులవారీగా ఓటర్ల జాబితాను ఇప్పటికే పంచాయతీ కార్యాయాలు, మండలాఫీసుల్లో ప్రజల కోసం డిస్‌ప్లేలో ఉంచింది రాష్ట్ర ఎన్నికల సంఘం. ఇకపైన అభ్యంతరాలు, ఫిర్యాదులు తీసుకునే అవకాశం లేకపోవడంతో ఇదే తుది జాబితా అని నొక్కిచెప్పింది.
మొత్తం ఓటర్లలో పురుషులకంటే మహిళలే 3,24,055 మంది ఎక్కువగా ఉన్నారు. థర్డ్ జెండర్ ఓటర్లు 493గా తేలింది. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో గ్రామ పంచాయతీలు 856 ఉంటే కనిష్టంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కేవలం 34 ఉన్నాయి. స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఫైనల్ చేసిన ఓటర్ల జాబితా ప్రకారం ఆయా మండలాలు, పంచాయతీల్లోనివారు వెబ్‌సైట్ ద్వారా చూసుకునే వెసులుబాటు ఉన్నది.



# తెలంగాణలో ఆర్‌ఆర్, ఆర్జీ ట్యాక్స్‌లు

**వారధి, స్టేట్ బ్యూరో:**
సీఎం రేవంత్ రెడ్డి తన ప్రతాపాన్ని పేదల ఇండ్లపై కాకుండా అనేక చెరువుల్లో బడా బాబులు, రాజకీయ వేత్తలు నిర్మాణాలు చేశారని వాటిపై ఆయన ప్రతాపం చూపాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొంగల, దోపిడీ పార్టీలని మండిపడ్డారు. హైడ్రా అంటే రేవంత్ రెడ్డేనని ఆయన పోల్చారు. ఫాతిమా కాలేజీని ఎందుకు కూల్చడం లేదో సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. పేదల ఇండ్లను కూలుస్తున్నారని, వారి పిల్లలకు విద్యా సంవత్సరం లేదా అని ప్రశ్నించారు. ఇల్లు కూలిస్తే అక్కడ చదువుకుంటున్న పిల్లలు ఎక్కడికి పోవాలని నిలదీశారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు గతంలో కేసీఆర్ ఇలాగే వ్యవహరించాడని, ఇపుడు రేవంత్ రెడ్డి కూడా అలాగే చేస్తున్నాడని పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితే తెలంగాణలో రాబోతోందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్ ఆదాయంతో రాష్ట్రాన్ని నడుపుతున్నారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణలో ఆర్‌ఆర్, ఆర్జీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపణలు చేశారు. పేదవారి ఇండ్లపై గడ్డపార పడితే ఈ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని రాహుల్ చెప్పారని, హైడ్రా కూల్చివేతలపై ఆయన సమాధానం చెప్పాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కుటుంబాలు, మహిళల గురించి మాట్లాడడం ఆ రెండు పార్టీలకు అలవాటైందని కేంద్ర మంత్రి విమర్శలు చేశారు. కేసీఆర్ దాన్ని మొదలుపెడితే.. రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడే వారిని మీడియా.. బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కోరారు. అలా వ్యాఖ్యానించిన వారి మాటలు టెలికాస్ట్ చేసినన్ని రోజులు ఆ నేతల తీరు మారదని పేర్కొన్నారు. రాజకీయాలు ఎంత దిగజారుతున్నాయనేందుకు కొందరు నేతల చౌకబారు వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి రాజకీయాలను మరింత దిగజార్చారని మండిపడ్డారు. మాజీ సీఎం కేసీఆర్.. ఫోన్ ట్యాపింగ్ తో అనేక కుటుంబాల అంతర్గత విషయాలు విన్నారని కోర్టులో అఫిడవిట్ వేశారని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు రెండు పార్టీలను బహిష్కరించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





## అత్యాచారం చేసిన నిందితుడికి కఠిన శిక్ష పడేలా కృషి చేస్తా..

- బీర్ల అయిలయ్య

**వారధి న్యూస్, సిద్దిపేట:** ఆలేరు ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, గురువారం గురువన్నపేట గ్రామంలో అత్యాచారం జరిగిన బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా, "అత్యాచారం చేసిన నిందితునికి కఠిన శిక్ష పడేలా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని" పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ్ మల్లేష్, మరియు మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ పాల్గొన్నారు. బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, "కురుమ సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం ఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నాను. సమాజంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరం. అత్యాచార బాధితురాలికి, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని తెలిపారు.అతను పోలీసులకు, "నిందితుడికి తక్షణమే శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలి" అని సూచించారు. బాధితురాలిని ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, మెరుగైన వైద్యం అందే విధంగా కృషి చేయాలని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు, అందులో ఇంటర్నేషనల్ షెఫర్డ్ ప్రెసిడెంట్ బురుగడ్డ పుష్ప నాగేష్, సిద్దిపేట జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు కోరే ఎల్లయ్య, మరియు జనగామ జిల్లా అధ్యక్షులు కంచే రాములు ఉన్నారు.అలాగే, సిద్దిపేట సీపీని 15 మందిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు.



## మల్కాజిగిరి హైడ్రా బాధితులకు అండగా ఉంటా..

- ఈటెల రాజేందర్

**వారధి న్యూస్, మల్కాజిగిరి:** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, హైడ్రా బాధితులకు అండగా ఉంటానని, వారి తరపున ఉద్యమాలు చేసి అవసరమైతే న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించారు. గురువారం, మల్కాజిగిరి, వినాయకనగర్ డివిజన్ లోని హైడ్రా బాధితుల ఇండ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా, "35 ఏళ్ల క్రితం బండ చెరువు చుట్టూ ఏర్పడిన కాలనీలలో చిరు ఉద్యోగులు, రోజువారీ కూలీలు, పేదవారు కష్టపడి ఇల్లు నిర్మించుకున్నారు" అని వివరించారు. "చనిపోయాక అనాథ శవాలలా పడవేయొద్దని, సొంత ఇల్లు కోసం పేదవాడు తాపత్రయపడతాడు" అని ఆయన తెలిపారు.ఈటెల రాజేందర్, "ఒకవైపు పేదల ఇండ్లను కూల్చడం, మరోవైపు ఎఫ్టిఎల్ బఫర్ జోన్ల పేరుతో మార్కింగ్ చేయడం అన్యాయంగా ఉందని" వ్యాఖ్యానించారు. "నీకు ఓటు వేసి గెలిపించిన ప్రజల ఇళ్లపై అక్రమంగా దాడులు చేస్తే, ప్రజలు సిగ్గుగా ఉండాలి" అని ప్రశ్నించారు.ఆయన మాట్లాడుతూ, "హైదరాబాద్ మునిగిపోవాలని, వరదలు రావాలని ఎవరు కోరుకోవడం లేదు, కానీ చెరువులు మురికి కూపాలుగా మారుతున్నాయి" అని అన్నారు. "హుస్సేన్ సాగర్ చుట్టూ జరిగే కార్యక్రమాలకు మనం అంతగా ఆందోళన చెందుతున్నాం" అని పేర్కొన్నారు.ఈటెల రాజేందర్, "రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి జ్ఞానం రావడం లేదు. ప్రజల కన్నీళ్ళతో సంబంధం నాకు రాజకీయాలకు కాదు, నేను మీ వెంట ఉంటానని" స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రావణ్, రాజ్యలక్ష్మి, సునీత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




## నార్త్ సిటీ మెట్రో సాధనకై పోరాటం చేస్తాము

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**వారధి న్యూస్, కుత్బుల్లాపూర్:** నార్త్ సిటీ మెట్రోను సాధించడానికి ప్రజల పక్షాన పోరాడుతామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం ప్రకటించారు. బిఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "69 కిలోమీటర్ల మేర మెట్రోని పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది" అన్నారు.కేపీ వివేకానంద్, "గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్, మెట్రో రైలును నగరంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు ముందుగా రాయదుర్గం నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు తీసుకువెళ్లాలని నిర్ణయించారు" అన్నారు."తమ ప్రభుత్వంలో 24 వేల కోట్ల బడ్జెట్ ను రెండవ దశ మెట్రో పనులకు కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 11 వందల కోట్ల బడ్జెట్ ను మాత్రమే కేటాయించింది" అని ఆయన తెలిపారు. "మహా నగరాన్ని అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలను రద్దు చేసింది" అని ఆరోపించారు.ప్రజల డిమాండ్ మేరకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర హైదరాబాద్ లో మెట్రో రైలును తీసుకురావాలని నిర్ణయించిందని కేపీ వివేకానంద్ చెప్పారు. "రేవంత్ రెడ్డి కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి మెట్రో అవసరమని చెప్పారు, కానీ ఎన్నికల తర్వాత వాగ్దానాలు చెల్లించలేదు" అని అన్నారు.అనంతరం, "మేడ్చల్ మెట్రో సాధన సమితి పేరుతో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. నార్త్ సిటీకి మెట్రో రద్దు గురించి ప్రభుత్వం ప్రజలకు వివరించాలని, లేకపోతే బిఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు" అని ఆయన పేర్కొన్నారు.

# ఈ సీజన్ నుంచే..సన్న వడ్లకు రూ.500 బోనస్

- తాలు, తరుగు పేరిట రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- అన్నదాతలను మోసం చేసే వారిపై క్రిమినల్ కేసులు
- రాష్ట్రవ్యాప్తంగా 7వేల ఐకేపీ కేంద్రాలు
- గోనెసంచులు అందుబాటులో పెట్టాలి
- ధాన్యం కొనుగోళ్లపై కాల్ సెంటర్
- కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



**వారధి, స్టేట్ బ్యూరో:**
ఈ సీజన్ నుంచే సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో తాలు, తరుగు, తేమ పేరిట రైతులను మోసం చేసే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైన చోట కొత్త ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సన్నవడ్లకు బోనస్ ఇస్తున్నందున అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గురువారం నాడు ధాన్యం కొనుగోళ్లు, డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనపై సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ఐకేపీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు.
రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ సీజన్ నుంచే సన్న వడ్లకు కనీస మద్దతు ధరకు అదనంగా ఒక్కో క్వింటాలకు రూ.500 బోనస్ చెల్లిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి కేంద్రానికి క్రమసంఖ్య ఇవ్వాలని, సన్నవడ్ల కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు చెప్పారు. గోనె సంచులు అందుబాటులో పెట్టాలని తెలిపారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే తరలించాలని చెప్పారు. వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ఐకేపీ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

**ధాన్యం కొనుగోళ్లపై కాల్ సెంటర్**
ధాన్యం కొనుగోలులో వ్యవసాయ అధికారులు భాగస్వామ్యం కావాలని, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు రోజూ రెండు గంటలు సమీక్షించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో రైతులు అందరూ సన్నబియ్యం పండించేలా అధికారులు చొరవ చూపించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**అక్టోబర్ 9న డీఎస్సీ నియామక పత్రాలు**
డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఎల్లుండి వరకు పూర్తి చేయాలని స్పష్టం చేసిన సీఎం, అక్టోబర్ 9న నియామక పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లోపే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.





## హమాస్ ప్రభుత్వాధినేత హతం

- మరో ఇద్దరు కీలక నేతలు సైతం
- ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటన
- సెంట్రల్ బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి
- 9 మంది మృతి.. 14 మందికి గాయాలు

**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**
మూడు నెలల క్రితం జరిపిన ఓ దాడిలో గాజాస్ట్రిప్‌లో హమాస్ ప్రభుత్వాధినేత రౌహి ముష్తాహను హతమార్చినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ గురువారం ప్రకటించింది. ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఏజెన్సీతో కలిసి ఈ దాడి చేశామని, ఇందులో రౌహితో పాటు హమాస్ పొలిటికల్ బ్యూరో భద్రత బాధ్యతలు చూసే సమేహ్ అల్ సిరాజ్, కమాండర్ సమీ ఔదేహ్‌ను హతమార్చినట్టు వెల్లడించింది. హమాస్ సీనియర్ నేతల్లో ముష్తాహ ఒకరని, హమాస్ ఉగ్రనేత యాహ్యా సిన్వర్‌కు కుడిభుజంగా అతడిని భావిస్తారని తెలిపింది. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి పాల్పడి, 1,205 మంది ఇజ్రాయెలీలను హతమార్చింది. అప్పటి నుంచి గాజాపై దాడులను ప్రారంభించిన ఇజ్రాయెల్ వేలాదిమంది హమాస్ మిలిటెంట్లతో పాటు కీలక నేతలను మట్టుబెట్టింది.

**లెబనాన్ పార్లమెంటుపై దాడి**
లెబనాన్‌లోని సెంట్రల్ బీరుట్‌లో గురువారం తెల్లవారుజామున ఓ అపార్ట్‌మెంట్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ప్రధానమంత్రి కార్యాలయం, పార్లమెంటు, ఐరాస కార్యాలయానికి కూతవేటు దూరంలోనే జరిగిన ఈ పేలుడులో తొమ్మిది మంది మరణించారు. మరో 14 మందికి గాయాలయ్యాయి. మృతుల్లో హెజ్బొల్లా సభ్యులతో పాటు సాధారణ ప్రజలు, సహాయక చర్యల్లో ఉన్న వైద్య సిబ్బంది కూడా ఉన్నారు. బెల్జియంకు చెందిన ఇద్దరు జర్నలిస్టులకు ఈ ఘటనలో గాయాలయ్యాయి. కాగా, పేలుడు తర్వాత సల్ఫర్ లాంటి వాసన వచ్చినట్టు స్థానికులు పేర్కొన్నారు. దీంతో ఇజ్రాయెల్ ఫాస్ఫరస్ బాంబులను ఉపయోగిస్తున్నదని లెబనాన్ అధికారిక జాతీయ వార్తా సంస్థ ఆరోపించింది. బుధవారం దక్షిణ లెబనాన్‌లో హెజ్బొల్లా జరిపిన దాడిలో ఎనిమిది మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించడంతో దాడుల తీవ్రతను ఇజ్రాయెల్ మరింత పెంచింది. కాగా, ఉత్తర ఇజ్రాయెల్‌లోని ఆ దేశ సైనికులు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాదాపు 20 క్షిపణులు, రాకెట్లతో దాడి చేసినట్టు హెజ్బొల్లా ప్రకటించింది. దక్షిణ లెబనాన్‌లో మరౌన్ అల్‌రాస్‌లో ఇజ్రాయెల్ సైనికుల బృందంపై బాంబు దాడి చేశామని పేర్కొన్నది. ఈ దాడిలో ఇజ్రాయెల్ సైనికులు కొందరు మరణించారని తెలిపింది.

## రేవంత్ పాలనలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే



**తరువాయిభాగం**
ఆగిపోయాయి. దీంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లేకుండా పోయాయి. ఆదాయం కూడా పూర్తిగా పడిపోయింది. ఇక రాష్ట్ర ఖజానాకు తగ్గుతున్న ఆదాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం.. పరిపాలన వైఫల్యానికి నిదర్శనం.. అనుభవ రాహిత్యంతోనే ఈ అనర్థం.. అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. సంపద సృష్టించి పేదలకు పంచే తెలివి.. సీఎం రేవంత్ రెడ్డికి లేకపోవడంతో అసలు సమస్య ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే ఈ దుస్థితి ఉంటే.. వచ్చే నాలుగేళ్లు కష్టకాలమే అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప.. దిద్దుబాటు చర్యలు కనుచూపు మేరలో కనిపించడం లేదన్నారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన పాపం.. మార్పు మార్పు అంటూ మోసం చేసిన కాంగ్రెస్ పార్టీదే అని కేటీఆర్ దుయ్యబట్టారు.

## మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించలేం

- ఇది సాంఘికపరమైన సమస్య
- మాకు ఆ అధికారం లేదు
- సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**
భార్యకు ఇష్టం లేని శృంగారాన్ని (మ్యారిటల్ రేప్) నేరంగా పరిగణించవలసిన అవసరం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. దీనికి తగిన శిక్ష విధించేందుకు ఇతర చట్టాలు ఉన్నాయని చెప్పింది. మ్యారిటల్ రేప్‌ను నేరంగా పరిగణించే అధికార పరిధి సుప్రీంకోర్టుకు లేదని స్పష్టం చేసింది. మ్యారిటల్ రేప్ అనేది చట్టపరమైన సమస్య కన్నా ఎక్కువగా సాంఘికపరమైనదని వివరించింది. దీని ప్రభావం నేరుగా సమాజంపై ఉంటుందని చెప్పింది. సంబంధితులందరితోనూ సంప్రదించకుండా కానీ, అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కానీ మ్యారిటల్ రేప్‌పై నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని తెలిపింది. వివాహం అనేది మహిళ ఇష్టానికి చెల్లుచీటీ రాయదనే విషయంతో కేంద్ర ప్రభుత్వం ఏకీభవించింది. మహిళ ఇష్టాన్ని పురుషుడు ఉల్లంఘించినట్లయితే, అందుకు దండన ఉండాలని తెలిపింది.
వైవాహిక బంధంలో ఉన్నవారి మధ్య ఇటువంటి ఉల్లంఘనలకు, అటువంటి బంధం లేనివారి మధ్య ఉల్లంఘనలకు తేడా ఉందని వివరించింది. దాంపత్యంలో భర్త నుంచి భార్య, భార్య నుంచి భర్త నిరంతరం సరైన లైంగిక సంబంధాలను ఆశిస్తారని, అటువంటి ఆకాంక్షలు భార్య ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక కార్యకలాపాలకు అంగీకారం తెలపాలని భార్యను బలవంతపెట్టే హక్కును భర్తకు ఇవ్వబోవని తెలిపింది. అత్యాచార నిరోధక చట్టాల ప్రకారం అటువంటి భర్తను శిక్షించడం మితిమీరినది, అవసరానికి మించినది అవుతుందని చెప్పింది. వివాహిత మహిళల ప్రయోజనాలను పరిరక్షించే చట్టాలను పార్లమెంటు చేసిందని తెలిపింది. గృహ హింస నిరోధక చట్టం వంటివి అమలవుతున్నాయని చెప్పింది. భార్యాభర్తల మధ్య బాంధవ్యంలో ఉండే అనేక అంశాల్లో శృంగారం ఒకటి అని కేంద్రం తెలిపింది. భారత దేశ సాంఘిక, న్యాయ పద్ధతుల దృష్ట్యా వివాహ వ్యవస్థ స్వభావాన్ని పరిశీలించినపుడు, ఈ వ్యవస్థను పరిరక్షించడం ముఖ్యమని చట్టసభలు అభిప్రాయపడితే, ఆ మినహాయింపును రద్దు చేయడం కోర్టుకు సరైనది కాదని స్పష్టం చేసింది.



## రైల్వే ఉద్యోగులకు 78 రోజుల బోనస్

**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**
రైల్వే ఉద్యోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. పండుగల నేపథ్యంలో బోనస్ చెల్లించేందుకు నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక అనుసంధానిత బోనస్ చెల్లించనున్నట్టు తెలిపింది. ఇందుకు రూ.2028.57 కోట్లు వెచ్చించనున్నట్టు వెల్లడించింది. లోకో పైలెట్లు, గార్డులు, టెక్నీషియన్ హెల్పర్స్ వంటి నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు చెల్లించే ఈ బోనస్ కింద ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 లభిస్తుంది. కాగా, ఈ ఉత్పాదక అనుసంధానిత బోనస్ ఆరో వేతన కమిషన్ సిఫార్సులకు బదులుగా ఏడో వేతన కమిషన్‌ను బట్టి ఇవ్వాలని రైల్వే సంఘాలు గురువారం సామాజిక మాధ్యమంలో ప్రచారాన్ని ప్రారంభించాయి. చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు ఫేజ్ 2లో భాగంగా మూడు కారిడార్ (నడవా)లు నిర్మించే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ నేతృత్వంలో గురువారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. వీటిని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. అందులో భాగంగా చెన్నైలో రవాణా సౌకర్యం మరింత మెరుగుకు మూడు కారిడార్లు నిర్మించాలని నిర్ణయించింది. మొత్తం 118.9 కి.మీ పొడవున నిర్మించే ఈ కారిడార్లలో 128 మెట్రో స్టేషన్లు ఉంటాయి. 63,246 కోట్లతో 2027నాటికి వీటిని పూర్తి చేస్తారు. ఈ ఫేజ్ 2 మెట్రో పూర్తయితే చెన్నై నగరానికి మొత్తం 173 కి.మీ మెట్రో సౌకర్యం కలుగుతుంది.

**5 భాషలకు ప్రాచీన హోదా**
దేశంలోని మరో ఐదు భాషలకు ప్రాచీన హోదా లభించింది. మరాఠీ, బెంగాలీ, పాళి, ప్రాకృతం, అస్సామీ భాషలకు 'శాస్త్రీయ భాష' హోదా కల్పిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రాచీన హోదా లభించిన భాషల సంఖ్య ఆరు నుంచి 11కు పెరిగింది. అంతకుముందు తెలుగు, తమిళం, సంస్కృతం, కన్నడ, మలయాళం, ఒడియా భాషలకు మాత్రమే ఈ హోదా ఉండేది.

**లక్ష కోట్లతో రెండు సాగు పథకాలు..**
దేశంలోని అన్నదాతల కోసం రెండు పథకాలను గురువారం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రూ. లక్ష కోట్లతో సుస్థిర వ్యవసాయం, ఆహార భద్రత లక్ష్యాలతో పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన, కృషోన్నతి యోజన పథకాలకు 1,01,321.61 కోట్లను విడుదల చేయాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి 'వంట నూనెలు నూనె గింజలు' మిషన్ కోసం రూ.10,103 కోట్లను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు మన దేశీయ అవసరాలు తీర్చేందుకు 50 శాతం పైగా దిగుమతులపైనే ఆధారపడుతున్నాం. రానున్న ఏడేండ్లలో నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలకు షాక్

- దానం, కడియం, తెల్లంలకు హైకోర్టులో ఎదురుదెబ్బ
- ఈ నెల 24న తదుపరి వాదనలు



**వారధి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు మరోసారి షాక్ తగిలింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్ళిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుల అనర్హతపై హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు డివిజన్ బెంచ్ నిరాకరించింది. సింగిల్ బెంచ్ తీర్పును అసెంబ్లీ కార్యదర్శి సవాల్ చేయగా..తీర్పుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్ట్ డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. ఈనెల 24న వాదనలు వింటామని చెప్పింది. ఎమ్మెల్యేల అనర్హతపై 20 రోజుల క్రితం సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ఖరారు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దానం, కడియం, తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని హైకోర్టును గతంలో బీఆర్ఎస్ ఆశ్రయించింది. పార్టీ ఫిరాయించిన ఆ ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని ఆదేశించింది హైకోర్టు ధర్మాసనం. తాము చెప్పినట్లుగా నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోకపోతే.. సుమోటోగా కేసు స్వీకరించి మళ్లీ విచారణ ప్రారంభిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు తీర్పుతో బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలలో టెన్షన్ పెరిగిపోయింది. అసెంబ్లీ స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? హైకోర్టు ఎలా రియాక్ట్ అవుతుందోనని ఉత్కంఠ నెలకొంది. దీంతో మరికొన్ని రోజుల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు ఎమ్మెల్యే సభ్యత్వంపై వేటు పడే ఛాన్స్ ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## శ్రీ హరి త్రిశక్తి క్షేత్రంలో బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణ



**వారధి న్యూస్, వలిగొండ:** వలిగొండ మండలంలోని శ్రీ హరి త్రిశక్తి క్షేత్రంలో గురువారం మొదటిరోజు శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా త్రిశక్తులు బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.త్రిశక్తి క్షేత్రంలోని మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు గులాబీ రంగు వస్త్రాలతో విశేష అలంకరణ చేసి, ప్రత్యేక అభిషేకాలు, నైవేద్యాలను సమర్పించారు.ఈ ఉత్సవాల్లో వేద సంస్కృతి పరిషత్ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవార్ల దర్శనం చేసుకున్నారు.



## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం

**వారధి న్యూస్, గండిపేట్:** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణేష్‌నగర్‌లోని బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ పూజల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికి దుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుతూ దసరా నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్ జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్

**వారధి న్యూస్,వనపర్తి:** శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ PC: 2398 రాకేష్ కు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్ సస్పెన్షన్ విధించారు. రాకేష్ హైదరాబాద్ కు గణేష్ బందోబస్తుకు వెళ్లి, బందోబస్తు పూర్తయిన తర్వాత పోలీస్ స్టేషన్లో రిపోర్టు చేయకపోవడం, అలాగే CCA నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించడం వంటి కారణాల వల్ల అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరిగింది.అదేవిధంగా, పానగల్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న PC: 2234 రామకృష్ణ ను కూడా సస్పెండ్ చేశారు. రామకృష్ణ ఎక్కువ అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు మరియు అధికారుల నుండి అనుమతి లేకుండా విధులకు హాజరుకాలేదు. ఈ అంశంపై అంతర్గత విచారణ జరగగా, ఉద్యోగుల తప్పిదం కనిపించడంతో, జిల్లా ఎస్పీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా రామకృష్ణను కూడా సస్పెండ్ చేసారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, "పోలీసు అధికారుల పనితీరును, సమాజంలో వారి ప్రవర్తనను పోలీసులు నిశితంగా పరిశీలిస్తారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ ఇలాంటి చర్యలను ఎవరు చేసినా ఉపేక్షించబడరు" అని స్పష్టం చేశారు.

## వికారాబాద్‌లో పోలీస్ అధికారుల బదిలీలు మరియు సస్పెన్షన్

**వారధి న్యూస్, వికారాబాద్:** మల్టీ జోన్ 2 ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వి. సత్యనారాయణ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లాలో పోలీస్ అధికారుల బదిలీలు జరగడం జరిగింది. ఈ ప్రక్రియలో తాండూర్ టౌన్ ఇన్స్పెక్టర్ సంతోష్ మరియు కరణ్ కోట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్‌లను ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేయడం జరిగింది. అదేవిధంగా, పెద్దేముల్ ఎస్సై గిరెన్న మరియు యాలాల ఎస్సై శంకర్‌లను కూడా జిల్లా ఎస్పీ కే. నారాయణ రెడ్డీ యొక్క ఆదేశాలతో జిల్లా ఎస్పీ ఆఫీస్‌కు అటాచ్ చేయడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉంటే, ప్రస్తుతం వికారాబాద్ పట్టణ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఏ. నాగరాజు పై కూడా సస్పెన్షన్ వేటు పడింది. గతంలో జోగిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికపై జరిగిన అత్యాచారానికి సంబంధించిన కేసు దర్యాప్తులో అలసత్వం ప్రదర్శించడమే కాక, అవకతవకలకు పాల్పడటం వలన మల్టీ జోన్ 2 ఇన్స్పెక్టర్ జనరల్ వి. సత్యనారాయణ ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.ఈ చర్యలు పోలీస్ శాఖలో సమర్థతను పెంపొందించడంకోసం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.




## చిన్న తరహా పరిశ్రమలు దేశ ప్రగతికి పునాది

- నిర్మల జగ్గారెడ్డి

**వారధి న్యూస్, కుషాయిగూడ:** దేశంలో చిన్న తరహా పరిశ్రమలు గొప్ప ఉత్పత్తులను అందిస్తున్నాయని టీజీఐఐసీసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. గురువారం కుషాయిగూడ చక్రిపురంలోని సిరి గార్డెన్‌లో నిర్వహించిన కాప్రా చిన్న తరహా (సూక్ష్మ) పరిశ్రమల యజమానుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, "సూక్ష్మతర పరిశ్రమలు దేశ ప్రగతికి పునాదిగా నిలుస్తున్నాయి. చిన్నతర పరిశ్రమలు ఉత్పత్తి చేసే గుండుసూది అనేక ఉత్పత్తులకు, భారీ పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి" అన్నారు. చిన్న తరహా పరిశ్రమల యజమానులు ఎంతో గొప్ప వారని ఆమె కితాబిచ్చారు.తదుపరి, "సూక్ష్మ, మధ్య, స్థూల పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుంది" అని నిర్మల జగ్గారెడ్డి తెలిపారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని చిన్న తరహా పరిశ్రమ యజమానులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని" హామీ ఇచ్చారు. యజమానుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, కార్యదర్శి గోపాల్ రావు, ఐలా కమిషనర్ ప్రభాకర్, మరియు కాప్రా చిన్న తరహా పరిశ్రమల యజమానుల సమాఖ్య నూతన అధ్యక్షుడు యాదయ్య, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాదారం ఇండస్ట్రియల్ పార్కులో చిన్నతరహా పరిశ్రమలకు ఉపయోగపడే విధంగా 450, 250 చదరపు మీటర్ల ప్లాట్లను కేటాయించాలని టీజీ ఐఐసీసీ చైర్మన్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రమాణస్వీకారం చేసిన నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# వరి ధాన్యం కొనుగోలు సజావుగా సాగాలి

- సన్న రకం వరి ధాన్యానికి అదనపు లబ్ధి
- డిఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాల అందజేత
- ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక కేంద్రాలు
- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వారధి న్యూస్, వనపర్తి బ్యూరో:** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు సజావుగా కొనసాగడానికి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.వరి ధాన్యం కొనుగోలు మరియు డిఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 అదనంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు, సన్న రకం మరియు దొడ్డు రకం ధాన్యాన్ని వేరు చేయాలని సీఎం సూచించారు. తరుగు తీసే మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

**సన్న రకం వరికి అదనపు ధర:**
రాష్ట్ర ముఖ్యమంత్రి రైతులకు సన్న రకం ధాన్యానికి అదనపు లబ్ధి అందించనున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యాన్ని వేరు వేరు కొనుగోలు చేయాలని, తరుగు తీయడం ఏమాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

**డిఎస్సీ నియామక పత్రాల పంపిణీ:**
డిఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అక్టోబర్ 9వ తేదీన పంపిణీ చేయనున్నందున, రెండు రోజుల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

**ఫిర్యాదు కేంద్రాలు:**
ధాన్యం కొనుగోలులో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కారం కోసం ప్రత్యేక ఫిర్యాదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు.

## తెలంగాణ కుటుంబ గుర్తింపు కార్డు సర్వే

- వనపర్తిలో పైలెట్ ప్రాజెక్ట్ పరిశీలన
- అంజనగిరీ గ్రామంలో సర్వే ప్రారంభం
- సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహణకు ఆదేశాలు
- డేటా డబుల్ కాకుండా జాగ్రత్తలు



**వారధి న్యూస్, వనపర్తి:** తెలంగాణ కుటుంబ గుర్తింపు కార్డు సర్వేలో భాగంగా వనపర్తి జిల్లా 10వ వార్డులో కుటుంబ వివరాల సేకరణ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ప్రత్యేక అధికారి జి. రవి నాయక్ ఆదేశించారు.వనపర్తి జిల్లాలో తెలంగాణ కుటుంబ గుర్తింపు కార్డు సర్వే పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రారంభమైంది. గురువారం నుండి ఇంటింటి సర్వేను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పరిశీలించారు. ప్రత్యేకంగా అంజనగిరి గ్రామంలో కుటుంబ వివరాలు సేకరణను పరిశీలించి, మున్సిపాలిటీ 10వ వార్డు నాగవరంలోనూ సందర్శించారు.

**సర్వే ప్రక్రియ:**
సర్వేలో జె. జయమ్మ అనే యజమాని ఇంటి వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా అధికారులు, డేటా బేస్ లో పేర్లు ఉన్నవారి వివరాలు ఫారం 1లో, లేనివారి వివరాలు ఫారం 2లో నమోదు చేస్తున్నట్లు తహసిల్దార్ రాజు వివరించారు.

**వివరాలు డబుల్ కాకుండా జాగ్రత్తలు:**
సర్వేలో వివరణలు డబుల్ కాకుండా జాగ్రత్తగా పరిశీలించాలని ప్రత్యేక అధికారి జి. రవి నాయక్ సూచించారు.

**సర్వేలో పాల్గొన్నవారు:**
మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్, తహసిల్దార్ రాజు, టీమ్ లీడర్ రమేష్ రెడ్డి సర్వేలో పాల్గొన్నారు.


## పాముకాటుతో బాలుడి మృతి



**వారధి న్యూస్, సిద్ధిపేట:** పాముకాటుతో బాలుడు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం సిద్ధిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన తుమ్మల శ్రీనివాస్ కుమారుడు మనీష్వర్ (8) గ్రామంలోని స్కూల్లో ఫస్ట్ క్లాస్ చదువుకుంటున్నాడు. దసరా సెలవులు రావడంతో, మనీష్వర్ ఇంట్లో తల్లితో ఉంటున్నాడు.ఈ క్రమంలో, గురువారం మధ్యాహ్నం బీడీలను మునీంకు ఇచ్చేందుకు తల్లితో కలిసి వెళ్ళిన మనీష్వర్, బీడీలు కార్ఖానా సమీపంలోని అట్టలతో ఆడుతూ ఉన్న సమయంలో పాము కాటు వేసింది. అయితే, కాటు వేసిన విషయాన్ని అతడు గమనించకపోవడం, తల్లికి "ఏదో పురుగు కరిచింది" అని చెప్పడంతో ఆమె పట్టించుకోలేదు. కొద్దిసేపు తర్వాత, అతడు నురగలు కక్కుతూ ఇంట్లో పడిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. అట్టలను చూసి చూడగా, అక్కడ రెండు పాములు కనిపించడంతో వాటిని చంపి, బాలుడిని హుటాహుటిన సిద్ధిపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. అయితే, అప్పటికే బాలుడు చనిపోయాడు.బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మైనర్ రేప్ కేసులో నిర్లక్ష్యం

- సీఐ సస్పెండ్



**వారధి న్యూస్, వికారాబాద్:** వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా పనిచేస్తున్న ఏ. నాగరాజు, జోగిపేట్ ఇన్స్ పెక్టర్ గా పనిచేస్తున్న సమయంలో ఓ మైనర్ రేప్ కేసులో దర్యాప్తును నిర్లక్ష్యం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై విచారణ జరిపిన ఐజీ వి. సత్యనారాయణ, అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో ఇన్స్ పెక్టర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.



## నవరాత్రుల పూజలు ప్రారంభించిన రాజుల వారసులు

**వారధి న్యూస్, వనపర్తి:** ప్రతి సంవత్సరం జరిగే నవరాత్రి ఉత్సవాలను ఈసారి వనపర్తి రాజుల వారసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు కూడా పాల్గొని, రాజుల వారసులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ, "తరాలుగా వస్తున్న సాంప్రదాయాలను కొనసాగిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు" అని తెలిపారు. నవరాత్రి పూజలు రాజా రామేశ్వరరావు బంగ్లా పరిధిలో కొనసాగించడం పరిపాటిగా ఉంది. ఈ సంవత్సరం, రాజా కృష్ణదేవరరావు గారు వారి కుటుంబంతో కలిసి పూజలు ప్రారంభించారు. ఈ పూజలు దసరా పండగ వరకు జరుగుతాయని తెలిపారు.పూజల అనంతరం, అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు రాజుల వారసులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య వ్యక్తులలో అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, డి.ఎస్.పి టౌన్ అధ్యక్షులు గంధం భరత్, బీసీ నాయకులు గౌనికాడి యాదయ్య, లోక్ సత్తా జిల్లా ఇన్చార్జ్ సూగూరు రాజ్ కుమార్, నాయకులు శివకుమార్, బల్మూరి భాస్కర్, రాములు తదితరులు ఉన్నారు.ఈ ఉత్సవాలు ప్రతి సంవత్సరం భక్తులందరిని ఆకర్షిస్తున్నాయి.



## అధ్యాపకులారా, ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోండి

- తీకుళ్ళ సాయిరెడ్డి విజ్ఞప్తి
- వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు
- అక్టోబర్ 30 నుండి నవంబర్ 6 వరకు నమోదు గడువు
- రిటైర్డ్ ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు

**వారధి న్యూస్, సూర్యాపేట:** వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు నమోదు చేసుకోవాలని ఏపీ యుఎస్, టిపియు ఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి గురువారం జరిగిన సమావేశంలో విజ్ఞప్తి చేసారు.2025 మార్చిలో జరగబోయే ఈ ఎన్నికల కోసం ఎన్నికల కమీషన్ నోటిఫికేషన్ విడుదలైనందున, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ ఓటును వెంటనే నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

**ఓటు నమోదు గడువు:**
సెప్టెంబర్ 30 నుండి నవంబర్ 6 వరకు ఉన్న గడువులో, దసరా సెలవుల్లోనే సర్వీస్ సర్టిఫికెట్ సేకరించి ఓటు నమోదు చేయాలని ఆయన సూచించారు.

**ప్రత్యేక సూచనలు:**
ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేసేవారికి కొన్ని నిబంధనల ప్రకారం ఓటు హక్కు ఉంటుందని, మార్చి 2024 నుండి రిటైర్ అయిన వారికి కూడా ఈ హక్కు వర్తిస్తుందని ఆయన వివరించారు.ప్రొఫెసర్ దండా మురళీధర్ రెడ్డి, నామాల వీరయ్య, తీకుళ్ళ శ్రీనివాస్ రెడ్డి, పి. వెంకన్న తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




## కేంద్రం హామీలు అమలు చేయాలని రైతు సంఘం డిమాండ్

**వారధి న్యూస్, మిర్యాలగూడ:** కేంద్రం తెచ్చిన నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన లకిమ్ పూర్ ఘటనలో అమరులైన రైతులకు గురువారం రాత్రి కోవొత్తుల ప్రదర్శనతో రైతు సంఘం నివాళులర్పించింది. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అమరులైన రైతులకు పరిహారం అందించాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వారు విజ్ఞప్తి చేశారు. హామీలు అమలు అయ్యేంత వరకు రైతు ఉద్యమాలు కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు.సీఐటీయూ రాష్ట్ర నాయకులు డబ్బికార్ మల్లేష్, సత్యనారాయణరావు, గోవింద్ రెడ్డి, కోటిరెడ్డి, రామకృష్ణ, రాజేష్, లింగా నాయక్, బాషా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## నాటు బాంబులను తయారు చేస్తున్న పోలీసుల అదుపులో ముఠా

- నాటు బాంబులతో వేటకు ప్రయత్నం

**వారధి న్యూస్, సిద్ధిపేట:** నాటు బాంబులను తయారు చేస్తున్న వ్యక్తితో పాటు జంతువులు, వణ్యప్రాణులను వేటాడుతున్న ముఠాను పోలీసులు పట్టుకుని రిమాండ్ కు తరలించినట్లు హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గురువారం హుస్నాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఈ వివరాలను వెల్లడించారు.గత కొన్ని రోజుల క్రితం మీర్జపూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ క్షేత్రాలలో నాటు బాంబులు ఏర్పాటు చేయగా, ప్రమాదవశాత్తు ఆ బాంబు పేలి, అక్కడ ఉన్న కలీమ్ అనే వ్యక్తి చేతి వేళ్ళకు గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాజుద్దీన్ అనే బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మీర్జాపూర్ గ్రామంలో నాటు బాంబులు ఉన్నట్లు నమ్మదగిన సమాచారాన్ని పొందిన తరువాత, పోలీసులు అక్కడకు వెళ్లి నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో నాటు బాంబులు తయారు చేస్తున్న పిట్టల స్వామి, ఎరుకల తిరుపతి, బధనపురం తిరుపతి, కందుకూరి భాస్కర్, కమ్మరి భాస్కర్, ఇటిక్యాల సతీష్ అనే వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.వన్యప్రాణులను వేటాడేందుకు నాటు బాంబులు ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ సీఐ కొండ్ర శ్రీనివాస్ హెచ్చరించారు.హుస్నాబాద్ ఎస్సై తోట మహేష్, కానిస్టేబుల్స్ నరేష్, రాజు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





## పదర పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ

- డిఎస్పి శ్రీనివాస్

**వారధి న్యూస్ నాగర్ కర్నూల్ బ్యూరో:** అచ్చంపేట డిఎస్పి పి, శ్రీనివాస్ పదర పోలీస్ స్టేషన్ ను గురువారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు తనిఖీ చేసి క్రైమ్ వెహికల్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరియు సిబ్బందికి దేవీ నవ రాత్రులు,బతుకమ్మ ఉత్సవాలు గురించి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా సాయంత్రం సమయంలో బతుకమ్మ నిమజ్జనాలు ఉంటాయి కాబట్టి అందరూ హాజరుగా ఉండి చైన్ స్నాచింగ్ దొంగతనాలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుర్గ దేవి మండపాలను తనిఖీ చేసి ఎలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని భక్తులతో గౌరవ మర్యాదలతో ఉండాలని సూచించినారు. కార్యక్రమంలో స్టేషన్ కు వచ్చిన డిఎస్పి కి ఎస్సై రాజు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.



## అకాల వర్షానికి తడిసిన మొక్కజొన్న పంట

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:**అచ్చంపేట పట్టణంలో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వ్యవసాయ మార్కెట్ కు రైతులు మొక్కజొన్న పంటను విక్రయించుకునేందుకు తీసుకొచ్చారు. ఒకసారి గా కురిసిన వర్షంలో మొక్కజొన్న తడిసి ముద్దయింది. వివిధ ప్రాంతాల నుంచి రైతులు మార్కెట్ కు మొక్కజొన్నలు తీసుకురాగా అకస్మాత్తుగా భారీ వర్షం కురిసింది. రైతులు మార్కెట్లో ఆరబెట్టిన మొక్కజొన్న పై తార్పాలింగ్ కవర్లు వేసినప్పటికీ భారీ వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. వర్షానికి కొట్టుకుపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.




## గ్రామంలో బహుజన బతుకమ్మ వేడుకలు

- గోడపత్రికలు విడుదల

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:**అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరు మండలం చెన్నారం గ్రామంలో ఈ నెల ఐదున బహుజన బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కాశన్న యాదవ్ తెలిపారు. అక్టోబర్ 5 సాయంత్రం 6 గంటలకు బహుజన బతుకమ్మ కార్యక్రమం డాక్టర్ అనురాధ సిబిఎం ట్రస్ట్ చైర్మన్ సారథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఎమ్మెల్యే సహకారంతో బహుజన బతుకమ్మ వ్యవస్థాపకులు విమలక్క బృందంతో బహుజన బతుకమ్మ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన అచ్చంపేట ప్రాంతంలోని ప్రజలను అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు

**గోడ పత్రికల విడుదల**

ఈనెల 5న చెన్నారం గ్రామంలో నిర్వహించే తలపెట్టిన బతుకమ్మ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను గురువారం సాయంత్రం అచ్చంపేట పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద కాశన్న యాదవ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కళాకారులు పాల్గొన్నారు.



## బిజెపి పార్టీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యదర్శిగా మద్దెర్ల శ్యాంసుందర్

**వారధి న్యూస్, హైదరాబాద్ :** బిజెపి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు , కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి బిజెపి పార్టీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యదర్శిగా మద్దెర్ల శ్యాంసుందర్ ను నియమించారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు, మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ నియమాక పత్రాన్ని మద్దెర్ల శ్యాంసుందర్ కు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మద్దెర్ల శ్యాంసుందర్ మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నా పై నమ్మకంతో ఇచ్చినందుకు వారి కి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు . అందరితో కలిసి నా బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తూ , పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తానని వెల్లడించారు . ఈ పదవి రావడానికి కృషి చేసిన నాయకుడికి, కార్యకర్తల కు పేరు పేరు నా ధన్యవాదాలు అని తెలిపారు .





## ఖరీఫ్ సీజన్ వరి కొనుగోలు కేంద్రాలు పకడ్బందీగా నిర్వహించాలి

- సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్
- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** హైదరాబాద్ అంబేద్కర్ సచివాలయం నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్.. అపాయింట్మెంట్ ఆర్డర్ల ప్రక్రియను గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ ఎస్పీలు అగ్రికల్చర్ మరియు మార్కెటింగ్, అధికారులతో నీటి పారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీ.ఎస్ శాంతికుమారి, తో కలిసి ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిచారు. నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోనీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుండి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్లు కె సీతారామారావు, దేవ సహాయం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.వరి కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్లు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు.ఈ కాన్ఫరెన్స్ లో సీఎం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల 73 వేల ఎకరాల్లో వరి ధాన్యం సాగు చేయబడిందని దాని కనుగుణంగా జిల్లాల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ వరి కొనుగోలు కేంద్రాలు పకడ్బందీగా నిర్వహించాలి. వరి కొనుగోలు కేంద్రాలు పెంపు .రైతులకు ఇబ్బంది లేకుండా అధికారులు పూర్తిస్థాయి వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు చేయాలి, ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు చేసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు గల సహకార శాఖ ద్వారా, ఐ కే పి, మెప్మా ,కేంద్రాలు రాష్ట్రంలో 7000 పైగా ఏర్పాటు చేయనున్నట్లు, ప్రతి గ్రామంలో దొడ్డు రకం వరి ధాన్యం, సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు వేరువేరుగా ఏర్పాటు చేయాలని, అందుకు తగ్గ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. వరి ధాన్యం ఎంఎస్పి ధర ఏ గ్రేడ్ రకానికి 2320, సాధారణ రకానికి 2300 గా ఉన్నదని, సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ను రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తుందని, సీఎం తెలిపారు. రైతుల దగ్గర నుంచి సేకరించిన ధాన్యం మిల్లలకు చేరేవరకు కొనుగోలు కేంద్రాలు బాధ్యత తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బందిని , వ్యవసాయ శాఖ అధికారులను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక ప్రత్యేక నెంబర్ ను కేటాయించాలని ప్రతి బస్తాపై ఆ కొనుగోలు కేంద్రం నెంబర్లను ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుంచి సన్న రకం వరి ధాన్యం రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ శాఖకు సీఎం సూచించారు.తెలంగాణ డీఎస్సీ 2024 ఫలితాల మెరిట్ ఆధారంగా ఎంపికైన ఉపాధ్యాయుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేసి ఈ నెల 9వ తేదీన ఉపాధ్యాయ నియామక పత్రాలను అందించేందుకు కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లను సీఎం ఆదేశించారు.ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియంలో ఎంపికైన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేయు కార్యక్రమానికి జిల్లాల అధికారులు పూర్తిస్థాయిలో బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఉపాధ్యాయుల ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసి, అర్హత సాధించిన ఉపాధ్యాయుల జాబితాను రూపొందించి రైతుల్ని ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవు,ఉపాధ్యాయుల నియామక పత్రాలను అందించేందుకు చర్యలు చేపట్టాలి కలెక్టర్,

**సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి,**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్,**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులు తో మాట్లాడుతూ-.....జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న, సహకార శాఖ ద్వారా, ఐకెపి, మెప్మా, సెంటర్ నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకుని కేంద్రాలను నిర్వహించాలని, సన్న రకం వరి ధాన్యం కు దొడ్డు రకం వరి ధాన్యం కు విడివిడిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు అవగాహన కలిగించాలని, సూచించారు. జిల్లాలోని వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లాలో ఎన్ని వరి కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి ఎక్కడ ఉన్నాయి సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు దొడ్డు రకం వరి కొనుగోలు కేంద్రాలు లాంటి అంశాలను నిరంతరం అవగాహన కలిగి ఉండాలని సూచించారు, రైతులకు ఇబ్బంది కలుగ కుండా గన్ని బ్యాగులు, సుతిలి వంటివి అందుబాటులో ఉంచాలని అన్నారు. మార్కెటింగ్ అధికారులు వరి కొనుగోలు కేంద్రాలకు అందిస్తున్న టార్పాలిన్లు, మాయిచ్చర్ మిషన్స్, వేయింగ్ మిషన్స్, గన్ని బ్యాగులు లాంటి అంశాలపై అధికారులను ప్రణాళిక బద్ధంగా ఉండాలని ఆదేశించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మిల్లర్లకు చేర్చే వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అన్నారు. కొనుగోలు చేసిన వరి ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా రవాణా సౌకర్యం ను ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాళ్లు తరుగు పేరుతో రైతులని ఇబ్బందులు గురి చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, వరి కొనుగోలు కేంద్రాల పకడ్బందీ నిర్వహణకై ఎంఈఓ ఎస్సై తాసిల్దార్ ల తో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు. చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మెరిట్ ఆధారంగా అర్హత సాధించి, ఎంపికైన ఏ ఉపాధ్యాయుడికి ఉద్యోగాల్లో నష్టం వాటిల్లకుండా, ప్రతి అభ్యర్థి ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు, మరిన్ని టీములను పెంచి, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయుల సహకారాలను తీసుకొని, ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.నాగర్ కర్నూల్ జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో ఎంపికైన ఉపాధ్యాయుల జాబితా ఆధారంగా 1:3 నిష్పత్తి ప్రాతిపదికన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను 100% పూర్తిచేసి ఈనెల 9వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఎంపికైన ఉపాధ్యాయులను తీసుకువెళ్లేందుకు తగిన ఏర్పాట్లను సిద్ధం చేయాలని డీఈఓ గోవిందరాజులు కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా రానున్న రెండు రోజుల్లో రోజువారీగా వెరిఫికేషన్ ప్రక్రియకు టీమ్లను పెంచి, ఎంపికైన జాబితా ఆధారంగా త్వరగా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



## మంత్రి కొండా సురేఖ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బీ.ఆర్.ఎస్ పార్టీ కార్పొరేటర్లు

**వారధి న్యూస్, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో మంత్రి కొండా సురేఖ పై హైదరాబాద్ బి. ఆర్.ఎస్ పార్టీ మహిళా కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి సభ్య సమాజం తలదించుకునేలా నిరాధారమైన ఆరోపణలు చేసిన కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని కోరిన మహిళా కార్పొరేటర్ లు. ఈ సందర్భంగా కొండా సురేఖ చేసిన నిరాధారమైన ఆరోపణలు వెనక్కి తీసుకొని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన గ్రేటర్ హైదరాబాద్ బి ఆర్ ఎస్ పార్టీ మహిళా కార్పొరేటర్ లు .



## అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలనను అత్యంత పారదర్శకంగా చేపట్టాలి

- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్


**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:**తెలంగాణ డీఎస్సీ 2024 ఫలితాల్లో నాగర్ కర్నూల్ జిల్లాలో డీఎస్సీ క్వాలిఫై అయి 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థుల అందరికీ ఫోన్ కాల్స్ ద్వారా తప్పనిసరిగా సమాచారమిచ్చి ఒరిజినల్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సజావుగా చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.నాగర్ కర్నూల్ జిల్లాలో 2024 డిఎస్సి నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించే కార్యక్రమాన్ని కలెక్టర్ నిశితంగా పరిశీలించారు.రోజుకు ఎంతమంది అభ్యర్థుల ధ్రువపత్రాలు ను పరిశీలిస్తున్నారని, ఏ ఏ అంశాలను పరిగణంలోకి తీసుకుంటున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి ఎంత సమయం పడుతుందని, అభ్యర్థుల నుంచి ఏ ఏ ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నారని తదితర వివరాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ 2024 రాత పరీక్షలో ఎంపికై 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపిక చేసిన ప్రతి అభ్యర్థికి తప్పనిసరిగా ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఎంపికైన ప్రతి అభ్యర్థి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డిఈఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఈనెల ఐదో తేదీ వరకు మెరిట్ జాబితా ఆధారంగా 1:3 ప్రకారం ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల ధ్రువపత్రాలను అత్యంత పకడ్బందీగా, సజావుగా ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టాలని ధ్రువపత్రాలను పరిశీలించే అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అర్హత పొందిన ఏ ఒక్క అభ్యర్థి నష్టపోకుండా ఒరిజినల్ ధ్రువపత్రాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. అవసరమైతే పరిశీలన కేంద్రాలను పెంచి ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.నాగర్ కర్నూల్ జిల్లాకు సంబంధించిన 285 పోస్టులకు గాను 885 మంది అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పరిశీలిస్తున్నామని, ఈ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమానికి హాజరయ్యే అభ్యర్థుల దరఖాస్తు పత్రం తో పాటు, గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరణతో రెండు సెట్ల జిరాక్స్ పత్రాలు, ఒరిజినల్ పత్రాలను పరిశీలిస్తున్నట్లు గోవిందరాజులు కలెక్టర్ కు వివరించారు.కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఏం గోవిందరాజులు, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, తిరుపతయ్య, వెంకటేశ్వర శెట్టి తదితరులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా వాసవి మాత శోభాయాత్ర

- బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నాగర్ కర్నూలు పట్టణంలో ని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించే 54వ శరత్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మార్కెట్ యార్డులోని శివాలయం నుండి వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు సాంప్రదాయ రీతిలో చెక్కభజనలు కోలాటం బతుకమ్మలతో నిర్వహించిన శోభాయాత్ర అట్టహాసంగా కొనసాగింది . ఉత్సవ కమిటీ అధ్యక్షులు రజిత హరిబాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు అనంతరం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు శోభాయాత్రలో చిరుతల భజన కోలాటం భక్తులను ఆకర్షించింది భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆలయానికి చేరుకుంది అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు పాండురంగ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వాసవి మాత భక్తులకు బాల



త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంకాల పూజ కార్యక్రమాలు అనంతరం గాజుల అలంకరణ గాజుల అభిషేకం నిర్వహించారు అనంతరం డాక్టర్ దీక్షితులు ఆధ్వర్యంలో భక్తి గీతాల ఆలాపన ప్రవచనాలు కొనసాగాయి ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు ఆర్యవైశ్య పుర ప్రముఖులు వ్యాపార వాణిజ్య సంఘాలు అశేషంగా భక్తులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఉద్యమకారుడి కూతురి పార్థివా దేహానికి నివాళి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావ్

**వారధి న్యూస్, రాయపర్తి /వరంగల్ :** రాయపర్తి మండలం,కొండూరు గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ సర్పంచ్ గుగులోత్ సోమ్లా నాయక్ గారి కూతురు శివాని మరణించగ, వారి పార్థివా దేహానికి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రి, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రబెల్లి దయాకర్ రావు వారి తో పాటు మండల పార్టీ నాయకులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు....

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com



# జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు



**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతత ను పెంపొందించేందుకు03 అక్టోబర్ 2024 సాయంత్రం నుండి 02 నవంబర్ 2024 వరకు, జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపిఎస్., ఒక ప్రకటనలో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్ లో మీటింగులు జరపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దోడ్డుకర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగ్ లను మరియు జనసమూహం ప్రోగు అవుట వంటివి నిషేధం. రాళ్ళను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం. లౌడ్ స్పీకర్ లు, డీజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేధము. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తప్పవు అలాగే మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకొనబడుతాయి. ఈ నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీస్ యాక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని ఎస్పి పేర్కొన్నారు.




## జోగులాంబ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్ ను ప్రారంభించిన డిఐజి శ్రీ ఎల్ ఎస్ చౌహన్ ఐపీఎస్

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం కవాతు మైదానం నందు, 2024 సంవత్సరానికి సంబంధించి జోనల్ స్థాయి పోలీసు డ్యూటీ మీట్ ఘనంగా ప్రారంభించిన జోగులాంబ జోన్7 డిఐజి శ్రీ ఎల్ ఎస్ చౌహన్, ఐపీఎస్.ఈ పోలీస్ డ్యూటీ మీట్ నందు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాలకు చెందిన పోలీసు అధికారులు మరియు సిబ్బంది తమ తమ ప్రత్యేక పోలీసు విధుల నైపుణ్యాలను ప్రదర్శిస్తారు.ఈ మీట్ లో వివిధ కేటగిరీలలో ఉన్న పోటీలు నిర్వహించబడతాయి, అందులో ముఖ్యంగసైంటిఫిక్ అయిడ్స్ టూ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్ లో ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా, వ్రాత పరీక్ష, ఓరల్ టెస్ట్, లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్ బిట్స్ ప్రాక్టికల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్ ప్రాక్టికల్ అండ్ ఓరల్ టెస్ట్, క్రైమ్ సీన్ ఫోటోగ్రఫీ ప్రాక్టికల్, పోలీస్ పోర్ట్రెట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్, అబ్జర్వేషన్ టెస్ట్ ప్రాక్టికల్ అండ్ రిటన్ టెస్ట్ 2.యాంటి సబాటేజ్ చెక్ ఈవెంట్ లో వెహికల్ సెర్చ్, గ్రౌండ్ సర్చ్, రూమ్ సెర్చ్, యాక్సిస్ కంట్రోల్,3. కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్ ఈవెంట్లో కంప్యూటర్ అవేర్నెస్ ఆఫీస్ ఆటోమేషన్, ప్రోగ్రామింగ్ ఎబిలిటీ, 4. డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్ ఈవెంట్ లో ట్రాకింగ్, ఎక్స్ప్లోజివ్ , నార్కోటిక్స్, సెర్చ్ మరియు పోలీస్ ఫోటోగ్రఫీ కాంపిటీషన్, పోలీస్ వీడియోగ్రఫీ కాంపిటీషన్ ఈవెంట్స్ నిర్వహించడం జరుగుతుంది.

ఈ సందర్భంగా DIG మాట్లాడుతూ, ఈ డ్యూటీ మీట్ ఉద్దేశం పోలీసు అధికారుల మరియు సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడం, వాటి వినియోగాన్ని ప్రోత్సహించడం క్రైమ్ ఇన్వెస్టిగేషన్ మరియు సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ ఉపయోగపడుతుందని అలాగే ఒక క్రిమినల్ చట్టం నుండి తప్పించుకోకుండా ఉపయోగపడుతుందని అన్నారు ఇందులో గెలుపొందిన వారిని స్టేట్ మీట్ కి పంపడం జరుగుతుంది, తదుపరి నేషనల్ మీట్ కి పంపడం జరుగుతుంది అని అన్నారు. అక్కడ గెలుపొందిన వారికి నగదు బహుమతి ప్రదానం చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ శ్రీమతి డి జానకి ఐపీఎస్, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, అదనపు ఎస్పీ నాగర్ కర్నూల్ రామేశ్వర్, అదనపు ఎస్పీ వనపర్తి రామ్ దాస్ తేజ, ఏఆర్ అదనపు ఎస్పీ నారాయణపేట రియాజ్ ఉల్ హక్, డిఎస్పి టౌన్ వెంకటేశ్వర్లు, డి.ఎస్.పి డిసిఆర్బి రమణారెడ్డి, డి.ఎస్.పి వర్టికల్ సుదర్శన్, డి.ఎస్.పి డి.టి.సి నరసింహులు, డీఎస్పీ గద్వాల్ నరేందర్ రావు, ఏఆర్ డి.ఎస్.పి శ్రీనివాసులు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## ఎర్రజెండా మార్గాన్ని నమ్మిన నాయకుడు కామ్రేడ్ ఎద్దుల లక్ష్మయ్య

**వారధి న్యూస్, వీపనగండ్ల :** సిపిఎం బొల్లారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం సీనియర్ కార్యకర్త కామ్రేడ్ ఎద్దుల లక్ష్మయ్య (77) అనారోగ్యంతో మృతి చెందారు. వారి పార్థివదేహానికి సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, ఎం కృష్ణయ్య, వీ కృష్ణయ్య, బాల గౌడ్ తదితరులు పార్టీ జెండా కప్పి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు మాట్లాడుతూ, కామ్రేడ్ లక్ష్మయ్య గ్రామంలో ఎర్రజెండా పార్టీకి అంకితమైన కార్యకర్తగా, పేదల అభివృద్ధికి పాటుపడిన నాయకుడిగా గుర్తుచేశారు. ఎర్రజెండా మార్గాన్ని నమ్మి, తన కుటుంబాన్ని కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారని వారు అన్నారు. ఆయన మృతి చాలా బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు పార్టీ సంతాపం తెలిపింది .ఈ అంత్యక్రియలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని, తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# సన్నబియ్యానికి క్వింటాల్ కు 500 రూ. లు బోనస్

- ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక సీరియల్ నెంబర్ ను కేటాయించాలి
- గన్ని బ్యాగులు, టార్పలిన్లను అందుబాటులో ఉంచుకోవాలి
- కొనుగోలు సమస్యలు తెలిపేందుకు 24 x7 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
- దసరాలోగా టీచర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు
- వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి






**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** గురువారం రోజున ఖరీఫ్ 202425 వరిధాన్యం కొనుగోలుకి సంబంధించి, డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్, నియామకం ఆర్డర్ల గురించి హైదరాబాద్ లోని సచివాలయం నుండి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, సి. ఎస్. శాంతి కుమారి, డిజిపి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వరిధాన్యం సేకరణలో సన్నబియ్యానికి అదనంగా క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు సంబంధించి జిల్లాలో పటిష్ట కార్యాచరణ తీసుకోవాలని అన్నారు. 7 వేల పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. గతానికి భిన్నంగా ఈ సీజన్ నుంచి సన్న రకం, దొడ్డ రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కౌంటర్లు , కాంటాలు ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు, కొనుగోలు కేంద్రంలో సరిపడా ప్యాడి క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులో ఉంచాలని, టోకెన్ పద్ధతి పాటించాలని, రైతులకు సరిపడు టార్పాలిన్ కవర్స్ అందుబాటులో ఉంచాలని, ఏరోజుకు ఆ రోజు ధాన్యం నాణ్యత పరీక్షించి రికార్డులో నమోదు చేయాలనీ తెలిపారు. సన్నరకం మరియు దొడ్డురకం వడ్లను గుర్తించుటకు గాను గ్రెయిన్ కాలిపర్స్ (సన్న వరి గుర్తింపు కోసం డయల్ మైక్రో మీటర్) ప్రతి కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో ఉంచుకోవాలని అధికారులని ఆదేశించినారు. సన్నరకం మరియు దొడ్డ రకం వడ్లను గుర్తించే విషయంలో ఏ. ఈ. ఓ. లు జాగ్రతగా వ్యవహరించాలని ఆదేశించినారు. అవసరమైన చోట కొత్తగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అవకతవకలు జరుగకుండా ఉంటాలంటే ఐకేపీ సెంటర్లకు సీరియల్ నెంబర్లను ఇవ్వాలని, అదే నెంబర్లను బియ్యం బస్తాల మీద వేయాలని, వీటి కోసం రెవెన్యూ సెక్రెటరీలను నియమించాలని ఆదేశించారు. గన్ని బ్యాగులు, టార్పలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని, వర్షాకాలం అయినందున వర్షం పడే అవకాశం ఉన్నందున ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడవకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వాతావరణ శాఖ నుంచి వచ్చే సూచనల ప్రకారం ఐకేపీ సెంటర్లలో రైతులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఐకేపీ సెంటర్లలో త్రాగునీటి సౌకర్యం, వరిధాన్యం సేకరణలో జాప్యం జరిగితే రైతులు ఉండేందుకు వీలుగా కనీస వసతి కల్పించాలని, అలాగే కొనుగోలు చేసిన ధ్యానం వెంటనే తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో సన్న బియ్యం, దొడ్డు బియ్యం సేకరించే ప్రక్రియలో వేరువేరుగా నిల్వ ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిచో అవకతవకలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి కలెక్టర్లు బాధ్యత వహించాలని 24 x 7 కాల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని, ఎక్కడ ఏ రైతుకు సమస్య వచ్చిన వెంటనే పరిష్కారం చేసే విధంగా కాల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. పక్క రాష్ట్రం నుండి ధాన్యం తెచ్చి ఇక్కడ అమ్మే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు బార్డర్ ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి చెక్ చేస్తుండాలని ఆదేశించారు. ప్రతి రోజు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటనలు నిర్వహించి తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసేవారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టాలని సిఎం ఆదేశించారు. 11,062 టీచర్ల భర్త కోసం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి విజయవంతంగా పరీక్షలు నిర్వహించి 1:3 క్రింద 25,239 మందిని ఎంపిక చేసి ఫలితాలు ప్రకటించామని, ఇప్పటి వరకు 9090 మాది అభ్యర్థులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరిగిందని అన్నారు. 2 రోజుల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, అక్టోబర్ 9 సాయంత్రం 4 గంటలకు ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్మెంట్ ఆర్డర్లు జారీ చేయాలని అన్నారు. దసరా కంటే ముందు టీచర్ల నియామకం పూర్తి కావాలని, జిల్లా కలెక్టర్లు దినిని ప్రాధాన్యత అంశంగా పూర్తి చేయాలని అన్నారు.రాష్ట్ర నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని అన్నారు. దొడ్డు రకం ధాన్యానికి ప్రపంచంలో డిమాండ్ తగ్గిపోతుందని, కేంద్ర ప్రభుత్వం కూడా కొనుగోలు తగ్గించిందని అన్నారు. ప్రజలకు అందించే రేషన్ బియ్యం అక్రమ రవాణా, దుర్వినియోగాలను అరికట్టేందుకు జనవరి నుంచి సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. సన్న రకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ 500 రూపాయల బోనస్ ప్రకటించిందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో తెలంగాణ వ్యాప్తంగా 60 శాతం మేర సన్న రకం ధాన్యం సాగు చేశారని, ప్రభుత్వం 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా తో చర్యలు తీసుకుంటుందని, దాదాపు 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వడ్ల కొనుగోలు చేయబోతున్నామని అన్నారు. జిల్లా స్థాయిలో అవసరాల మేరకు నూతన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామాగ్రి వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డు రకం ధాన్యం సన్న రకం కోనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని అన్నారు. మిల్లర్ల వద్ద ఎటువంటి ధాన్యం కోతలు జర్గవద్దని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం భద్ర పరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గో డౌన్ సన్నద్ధం చేయాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్ తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా బార్డర్ల వద్ద చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్ పి.డి జానకి , అదనపు కలెక్టర్ లు శివేంద్ర ప్రతాప్,మోహన్ రావు , వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఆనంద ఉత్సవాల మధ్య దేవీ నవరాత్రుల ఉత్సవాలు జరుపుకోవాలి

- జిల్లా ఎస్పీ డి జానకి ఐపిఎస్



**వారధి న్యూస్, మహబూబ్ నగర్,:** నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించ తలపెట్టిన దుర్గామాత మండపాల కార్యవర్గ సభ్యులకు, నిర్వహకులకు జిల్లా ఎస్పీ శ్రీమతి డి జానకి ఐపిఎస్ పలు సూచనలు చేశారు మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయన సంఘటనలు జరగకుండా పాటించవలసిన నియమ నిబంధనల గురించి తగు సూచనలు జారీ చేశారు ప్రస్తుతం జిల్లాలో మొత్తం (269) దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేశారనీ ఇట్టి దుర్గామాత విగ్రహాలు నిర్వాహకులు సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి తగిన అనుమతి తీసుకోవాలనీ ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారి పర్మిషన్ తీసుకుని కరెంటు వాడాలనీ దుర్గామాత మంటపానీ రోడ్డు పక్కన గాని, ఖాళీ స్థలంలో గాని ఏర్పాటు చేసుకోవాలన్నారు విగ్రహం యొక్క స్టేజ్ కింద ఎలాంటి అవాంఛనీయ వస్తువులు ఉంచరాదనీ మంటపాల వద్ద తగినంత సంఖ్యలో స్థానిక, సత్ప్రవర్తన కలిగిన వాలంటీలను నియమించి భక్తులను క్రమబద్ధీకరించే విధంగా చూడవలెననీ వివాదాస్పద ప్రదేశాలలో మంటపాలు ఏర్పాటు చేయకుండా. ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలిగించకుండా దుర్గామాత మంటపాల వద్ద వాలంటీర్లు 24x7 తప్పకుండా కాపలా ఉండేలా చూసుకోవాలనిసూచించారు. మంటపాలలో ఆసాంఘిక కార్యాకలాపాలకు తావివ్వకుండా మంటపాలలో టపాకాయలు మరియు మందు గుండు సామాగ్రిని ఉంచరాదనీ. మంటపాల దగ్గర పూజా సమయంలో భక్తుల వాహనాలను సరైన పద్ధతిలో పార్కింగ్ చేయుటకు ఏర్పాటు చేసుకోవాలని. దుర్గామాత విగ్రహాల కమిటీ మెంబర్ల పేర్లు, సెల్ ఫోన్ నెంబర్లు, సంబంధిత పోలీస్ స్టేషన్లో ఇవ్వాలనీ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉదయం ఆరు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు స్పీకర్లను తగిన సౌండ్ మోతాదులోనే ఉంచవలెననీ లౌడ్ స్పీకర్లు విద్యాలయాలకు, ఆసుపత్రులకు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలకు, ప్రార్థన మందిరాలకు ఇబ్బంది కలిగే విధంగా ఉండదన్నారు మంటపాల వద్ద నీళ్ల డ్రమ్ములు మరియు ఇసుక తప్పనిసరిగా ఉంచవలెను. మహిళల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలి. మంటపాల చుట్టూ తగినంత వెలుతురు ఉండేలా చూడాలి. విద్యుత్ కోత సమయంలో తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు విధిగా ఏర్పాటు చేసుకోవాలి. రెచ్చగొట్టే పోస్టర్లు గాని బ్యానర్లు గాని కరపత్రాలు గాని సోషల్ మీడియా మెసేజ్ లలో ప్రచారం చేయరాదు. మంటపాల వద్ద కొత్త వ్యక్తులు సంచరించినచో పోలీస్ వారికి విధిగా తెలియపరచాలి. విగ్రహ ప్రతిష్ట నుండి మొదలుకొని నిమజ్జనం వరకు సంబంధిత ఆర్గనైజర్స్ పూర్తి బాధ్యత వహించవలెను. పెద్దలు నిర్ణయించిన తేదీల లోపల ఎలాంటి అవాచనీయ సంఘటనలకు తావివ్వకుండా నిమర్జనం పూర్తి చేయాలి. విగ్రహాలను ఏర్పాటు చేసిన వారు మండపాల వద్ద మరియు పరిసర ప్రాంతాలలో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఎటువంటి చిన్న సమాచారం ఉన్న మీ దగ్గరలోని పోలీస్ వారికి లేదా డయల్ 100 కు తెలపగలరు. ప్రతి దుర్గామాత మండపాల దగ్గర విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేయవలెను. దుర్గామాత విగ్రహాలను జియో ట్యాగింగ్ ద్వారా గూగుల్ మ్యాప్ లకు అనుసంధానం చేయడం జరుగుతుంది. ఇందుకుగాను మంటపాల వద్దకు బ్లూ కోల్ట్స్ లేదా పెట్రోలింగ్ పోలీస్ సిబ్బంది వెళ్లి జియో టాకింగ్ చేయడం జరుగుతుంది.నిర్వాహకులు, ప్రజలు పోలీసు వారి సూచనలు సలహాలు పాటిస్తూ ప్రశాంతంగా ఆనందోత్సవాల మధ్య దుర్గామాత ఉత్సవాలు జరుపు జరుపుకోవాలని సూచించారు.



## మొదలైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** జిల్లాలో దేవి శరన్నవరాత్రి దసరా ఉత్సవాలు గురువారం మొదలయ్యాయి అమ్రాబాద్ మండల కేంద్రంలో గల శ్రీశ్రీశ్రీ అమరేశ్వర స్వామి దేవాలయంలో మొదటి రోజు అమ్మవారి అలంకరణ బాల త్రిపుర సుందరి దేవిగా అవతరించారు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దేవతకు పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## శ్రీ బాలా త్రిపురసుందరి అలంకరణ తో దర్శనమిచ్చిన అమ్మవారు



**వారధి న్యూస్, పెబ్బేరు:** దసరా ఉత్సవాలలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పెబ్బేరు మండలంలో ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం పెబ్బేరు ఆర్యవైశ్య సంఘం, శ్రీ భవాని సేన యూత్, తోగుట వీర క్షత్రియ సంఘాల ఆద్వర్యంలో, సుగూరు రామాలయ కమిటి ఆద్వర్యంలో అమ్మవారు విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పెబ్బేరు ఆర్యవైశ్య సంఘం మహిళలు, యువకులు, సంఘం సభ్యులు, పెద్దలు పట్టణంలోని భక్తంజనేయ స్వామి ఆలయం నుంచి వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయం వరకు వాసవి మాత ఉత్సవ మూర్తితో, మహిళలు కలశాలను ఎత్తుకొని ఊరేగింపు తీశారు. ఉత్సవాల్లో భగాంగా మహిళలు బతుకమ్మ ఆడారు. బతుకమ్మను నెత్తిన పెట్టుకొని వాసవి మాత ఆలయం వరకు ఊరేగింపు తీశారు. తొగుట వీర క్షత్రియ సంఘవారు చౌడేశ్వరి ఆలయంలో హోమం, అభిషేకం నిర్వంచారు. వాసవి కన్యక పరమేశ్వరి మాతకు పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం తీర్థ, ప్రసాదాలు, అన్నదాన వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.




## అంతర్జాతీయ సాహిత్య సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఎం.వి.యస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న జరిగే అంతర్జాతీయ తెలుగు సాహిత్య సదస్సును జయప్రదం చేయాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ కోరారు. దీనికి సంబంధించి ఒక బ్రోచర్ ను గురువారం వనపర్తి లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ సుప్రసిద్ధ సాహితీవేత్త స్వర్గీయ "డా. కపిలవాయి లింగమూర్తి సాహిత్యానుశీలనం"అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ సదస్సు ఆఫ్ లైన్ మరియు ఆన్ లైన్ విధానంలో జరుగుతుందని ఆసక్తి గల సాహితీ వేత్తలు పాల్గొనవచ్చని సూచించారు. కపిలవాయి లింగమూర్తి వ్యాస రచనలలో సామాజిక,చారిత్రక,ఆధ్యాత్మిక,కుల వృత్తులు,దేవాలయాల, స్థానిక చరిత్ర, సాహిత్య విమర్శ తదితర అంశాలపై 5 పేజీలకు మించకుండా తమ పరిశోధక వ్యాసాలను ఈ నెల 15 వ తేదీలోగా కళాశాల తెలుగు విభాగానికి పంపవలసి ఉంటుందని తెలిపారు. ఈనాటి కార్యక్రమంలో సాహితీ వేత్తలు బైరోజు చంద్ర శేఖర్,డా. అంబటి భాను ప్రకాష్,డా.బి.శ్యాం సుందర్,ప్రధానోపాధ్యాయులు గణేష్ కుమార్,వరప్రసాద్ రావు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు బౌద్ధా రెడ్డి,మహిపాల్ రెడ్డి,రవీందర్ గౌడ్, పసుపుల ప్రసాద్,శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్లే ప్రమాదాలు

- కాంగ్రెస్ నేత దిడ్డి ఆంజనేయులు యాదవ్ వినతిపత్రం



**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :** మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డు పాలకొండ గ్రామం శివాజీ చౌరస్తా వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అక్కడ వాహనాలు వేగంగా నడవడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలలో అమాయకులు మరణించడం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దిడ్డి ఆంజనేయులు యాదవ్ మహబూబ్ నగర్ డిఎస్పి పి.వెంకటేశ్వర్లు ని కలిసి వినతిపత్రం అందజేశారు.స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వినతిపత్రం పరిశీలించిన డిఎస్పి వెంకటేశ్వర్లు తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com


# ఈ పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టండి
## యానిమల్ భామ



'యానిమల్' చిత్రంతో ఓవర్‌నైట్‌లో స్టార్‌డమ్‌ను సంపాదించుకుంది కథానాయిక త్రిప్తి డిమ్రి. ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలతో బిజీగా ఉంది. తాజాగా ఆమె ఓ వివాదంలో చిక్కుకుంది. వివరాల్లోకి వెళితే..ఇటీవల జైపూర్‌లో మహిళా పారిశ్రామిక వేత్తలు ఓ సదస్సును నిర్వహించారు. దీనికి పలువురు బాలీవుడ్ స్టార్స్‌ను కూడా ఆహ్వానించారు. వారిలో త్రిప్తి డిమ్రి కూడా ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి నిర్వాహకులు ఆమెకు ఐదు లక్షల రూపాయలను అందించారని తెలిసింది. అయితే తన తాజా చిత్రం 'విక్కీ విద్య కా వోవాలా వీడియో' ప్రమోషన్‌లో బిజీగా ఉండటం వల్ల త్రిప్తి డిమ్రి మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు హాజరుకాలేక పోయింది. దీంతో నిర్వాహకులు ఆమె వ్యహహార శైలిని తప్పబడుతూ, ఈవెంట్‌లో ఏర్పాటు చేసిన ఆమె పోస్టర్లను ధ్వంసం చేశారు. ఈ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారంపై త్రిప్తి డిమ్రి వ్యక్తిగత టీమ్ స్పష్టత నిచ్చింది. జైపూర్ ఈవెంట్‌లో పాల్గొనడానికి త్రిప్తి డబ్బులు తీసుకుందనే వార్తలు పూర్తి అవాస్తవమని, సినిమా ప్రమోషన్‌లో బిజీగా ఉండటం వల్లే అక్కడకు వెళ్లలేకపోయిందని వివరణ ఇచ్చారు. 'వృత్తిపరంగా త్రిప్తి చాలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంది. ప్రైవేట్ ఈవెంట్స్‌కు కూడా ఆమె డబ్బులు తీసుకోదు. దయచేసి ఈ పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టండి' అని ఆమె టీమ్ స్పష్టం చేసింది.



## 25న విడుదల 'రోటి కపడా రొమాన్స్'

'హుషారు, సినిమా చూపిస్త మావ, మేం వయసుకు వచ్చాం, ప్రేమ ఇష్క్ కాదల్, పాగల్' వంటి యూత్ ఫుల్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత, లక్కీ మీడియా అధినేత బెక్కం వేణుగోపాల్.. సృజన్ కుమార్ బొజ్జంతో కలిసి నిర్మించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. అక్టోబర్ 25న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'నేటి యువతరంకు నచ్చే అంశాలతో పాటు కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో యూత్‌ఫుల్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. చిత్రంలోని ప్రతి పాత్ర అందరికి ప్రతి యూత్‌కు కనెక్ట్ అయ్యే విధంగా వుంటుంది. రొమాన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్ ఈ చిత్రానికి ప్రధాన బలాలు. తప్పకుండా చిత్రం అందరికి నచ్చుతుందనే నమ్మకం వుంది. ఇటీవల విడుదలైన పాటలకు, ట్రయిలర్‌కు మంచి స్పందన వచ్చింది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ఏదో ఒక కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలనే వుద్దేశంతో ఇలాంటి ఓ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను తీశాం. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం చిత్రానికి ఎంతో ప్లస్ అవుతుంది. సినిమా విజయం గురించి ఎలాంటి డౌట్ లేదు. తప్పకుండా హిట్ కొడుతున్నాం. అయితే ఏది ఏ రేంజ్ అనేది ఆడియన్స్ చేతిలో వుంది. ఇదొక ఎమోషనల్ రైడ్. లవ్, ఎమోషన్ వుంటుంది. అన్ని రకాల ఎమోషన్స్ చిత్రంలో వుంటాయి' అన్నారు.



## 5న విజయవాడలో 'మట్కా' టీజర్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హైలీ యాంటిసిపేటెడ్ పీరియడ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వంలో వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. రీసెంట్ గా రిలీజైన సెకండ్ లుక్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ ఈ సినిమా టీజర్‌కు సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు. మట్కా పవర్ ప్యాక్డ్ టీజర్ అక్టోబర్ 5న విడుదల కానుంది. టీజర్ లాంచ్ ఈవెంట్ విజయవాడ ఓల్డ్ థియేటర్ రాజ్ యువరాజ్ లో జరగనుంది. వరుణ్ తేజ్ కెరీర్ లో హయ్యస్ట్ బడ్జెట్ మూవీగా రూపొందుతున్న 'మట్కా'లో మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి జి.వి.ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందిస్తున్నారు ఎ.కిషోర్ కుమార్ సినిమాటోగ్రఫర్. కార్తీక శ్రీనివాస్ ఆర్ ఎడిటర్. షూటింగ్ చివరి దశలో ఉన్న మట్కా నవంబర్ 14న విడుదల కానుంది.